J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 42 22.03.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అక్షరాలకే అ, ఆలు నేర్పించిన అయ్యోరు ఇక లేరు

### రత్నం మాస్టారు కన్నుమూశారు



దివికేగిన విద్యాశిఖరం

8-9 లో...

## బాబోయ్ రొచ్చు.. అదిరిపోయే ఖర్చు!

### ఆంధ్రాలో నాల్గవ విడత, నాయకులకి నోట్ల కొరత

### మన రాష్ట్రంలో మే 13ని పోలింగ్ డేగా నిర్ణయించడంతో కాసుల వేటలో పడ్డ అభ్యర్థులు

**ఎప్పుడెప్పుడా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూసిన 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చేసింది.**

**నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ని గతంలోలాగే 7 దశలలో నిర్వహించడానికి భారతదేశ ప్రధాన ఎన్నికల సంఘం నిర్ణయించింది.**

**లోక్‌సభ, అసెంబ్లీలకి ఏ ఏ రాష్ట్రాలలో ఎప్పుడెప్పుడు పోలింగ్ ఉంటుందో స్పష్టంగా వివరిస్తూ మార్చి 18వ తేదీన ఆ వివరాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**

**ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఓట్ల పండుగను నోట్ల పండుగగా మార్చుకోవడానికి సామాన్య జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.**

**అయిదేళ్లకి ఒకసారి కనిపించే తమ దగ్గర డబ్బులు తీసుకుని తమ ఓట్లని అమ్ముకుంటున్న అమాయక జనాన్ని మరోసారి మోసం చేయడానికి రాజకీయ పార్టీల నేతలు ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారు.**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఈ ఎన్నికలు ఒక పెద్ద యజ్ఞం లాంటివనే చెప్పొచ్చు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా విస్తరించిన భారత్‌లో 18వ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం 543 లోక్‌సభ స్థానాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిస్సా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అంతేకాదు, దేశంలో పలు కారణాల వల్ల ఖాళీ అయిన 13 రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ స్థానాలకు మొత్తంగా.. 7 దశల్లో ఎన్నికలు జరుగనుండడంతో ఎన్నికల కమిషన్ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తోంది.

ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్1న ఏడో (చివరి) విడత పోలింగ్ జరుగుతాయి కనుక, అన్నింటినీ కలిపి జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు పెద్ద కసరత్తే చేయాల్సి వస్తోంది. ఎన్నికల నిర్వహణ అంతా పూర్తయ్యేసరికి దాదాపు రెండున్నర నెలలు పడుతుంది. గతంలో ఎన్నికలు ఇంత సుదీర్ఘకాలం జరగలేదు.

14 లో

## కన్నీటి నివాళి

కొన్ని లక్షల మంది విద్యార్థినీ విద్యార్థుల
భవితను తీర్చిదిద్దిన విధాత..

నాలాంటి వారెందరినో వెన్నుతట్టి
ప్రోత్సహించిన స్ఫూర్తిప్రదాత..

నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులు,
దైవసమానులు, గురుతుల్యులు

రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు

**కే.వీ.రత్నం గారి**

పవిత్ర ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ,
కన్నీటి నివాళులర్పిస్తున్నాను.

**బి.వి.కృష్ణారెడ్డి**
ఫౌండర్ & ఛైర్మెన్

**డాక్టర్స్ మెడికల్ అకాడమీ**
**అమరావతి ఐఐటీ - జేఈఈ అకాడమీ**

తిరుపతి - నెల్లూరు - విజయవాడ - బెంగళూరు - హైదరాబాదు



**కొర్రపాటి వెంకటరత్నం**

జననం : 23.05.1943 నిర్యాణం : 20.03.2024

# వైకాపాకి.. వంటేరు రాజీనామా

## - ఆత్మగౌరవం చంపుకోలేక పార్టీని వీడుతున్నానన్న కావలి మాజీ ఎమ్మెల్యే



కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆ పార్టీకి ఇటీవల రాజీనామా చేయడం కావలి నియోజకవర్గంలో కలకలం కలిగించింది. ఆత్మాభిమానం చంపుకోలేక పార్టీని వీడుతున్నట్లు ఆయన ఈనెల 15న కావలిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చెప్పడం మరింత సంచలనమైంది.

టీడీపీలో చేరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారన్న అభిప్రాయాలు వినవస్తున్న నేపథ్యంలో, ఆయన వైకాపా రాష్ట్ర రాజకీయ సలహా కమిటీ సభ్యునిగా, పార్టీ ప్రాథమిక సభ్యునిగా కూడా రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పంపినట్లు ఆయన తెలిపారు. వైకాపాలో చేరి పదేళ్ళు గడుస్తున్నా ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులను గెలిపించడం తప్ప, పార్టీలో తమకు సముచిత స్థానం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం లేనిచోట తాము పనిచేయలేమన్నారు. ఏళ్ళతరబడిగా రాజకీయాల్లో ఉన్నా పార్టీ సూచించిన అభ్యర్థులను ఎంతో కష్టపడి గెలిపించినా తగిన గుర్తింపులేదన్నారు. తన అభిమానులతో చర్చించిన తర్వాత ఏ పార్టీలో చేరబోయేదీ త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో వంటేరు అనుచరులు పాతూరు రామిరెడ్డి, మెట్టుకూరు రాంజీరెడ్డి, చేవూరు అజయ్‌కుమార్‌రెడ్డి, జేడీ మల్లికార్జున్, మాజీ మండలాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


### జగన్ బస్సుయాత్ర..

# పరదాలు కట్టుకునే చేస్తారా?

## టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శ



అధికారంలోకి వచ్చి అయిదేళ్ళవుతున్నా ప్రజల కష్టాలు తెలుసుకోలేని జగన్ ఇప్పుడు ప్రజలను మరోసారి మాయమాటలతో మభ్య పెట్టడానికి బస్సుయాత్ర పేరుతో బయటకు వస్తున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఈనెల 19న నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, జగన్ త్వరలో మొదలుపెట్టనున్న బస్సుయాత్రపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గతంలో బారికేడ్ల మాటున, పరదాల చాటున ప్రయాణం చేసిన జగన్, అదే పరదాలను కట్టుకొని బస్సు యాత్ర చేస్తారా? అని ప్రశ్నించారు. అయిదేళ్లు పదవిని అనుభవించిన తర్వాత ఇప్పుడు ఎన్నికల కోసం మళ్లీ జగన్ పరదాలు వదిలి ప్రజల్లోకి వస్తున్నాడన్నారు. జగన్‌కి త్రెట్ ఉన్నందువల్ల సెక్యూరిటీ పెంచుతున్నట్టు డీజీపీ మూడు నెలల కిందట ప్రకటించారని, జగన్‌కు నిజంగా త్రెట్ ఉంటే బస్సుయాత్ర అనుమతిని రద్దుచేయాలని ఆయన అన్నారు. జగన్ భద్రత కోసమంటూ హెలికాప్టర్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైపోయిందని ఆయన ఆరోపించారు. జగన్‌కు త్రెట్ ఉందంటూ ఇప్పటి దాకా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన ప్రాంతాల్లో పచ్చని చెట్లను భారీస్థాయిలో కొట్టేశారని, దీనిపై కేంద్ర గ్రీన్‌ట్రిబ్యునల్ విచారణ జరిపి, అందుకు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.




### ఉమ్మడి ప్రభుత్వ స్థాపనే

# జనసేన లక్ష్యం

## దుగ్గిశెట్టి సుజయ్‌బాబు



రానున్న ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ నగర శాఖ అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు కోరారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఇటీవల నెల్లూరులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన పార్టీ పదకొండేళ్ళ క్రితం ఆవిర్భవించిందన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయాలకు కట్టుబడి పనిచేద్దామని, పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఆయన కోరారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది కపటప్రేమ

## - బీసీ నాయకుని విమర్శ -

రాష్ట్రాన్ని విడదీసిన కాంగ్రెస్ ఇప్పుడు కపటప్రేమ చూపుతోందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య విమర్శించారు. ఈనెల 17న నెల్లూరులోని బీసీ విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలను కాంగ్రెస్–బీజేపీలు ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నాయని, ఆ రెండు పార్టీలు బీసీలకు చేసిందేమీలేదన్నారు. బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నాయని ఆరోపించారు.



# చరిత్రాత్మకం.. చిరస్మరణీయం ఆయన సేవలు

## రత్నం మాస్టారుకి ప్రముఖుల నివాళి

రాష్ట్ర విద్యారంగానికి కే.వీ.రత్నం అందించిన సేవలు చరిత్రాత్మకం.. చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. కే.వీ.రత్నం మరణవార్త తెలుసుకున్న నెల్లూరుకు చెందిన ప్రముఖులు, నాయకులు అనేకమంది ఆయన పార్ధివదేహాన్ని సందర్శించి కడసారి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, మాజీమంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు..మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు జే.కే.రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కురుగొండ్ల రామకృష్ణ, మాజీఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, వివిధ పార్టీల నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, ఆనం రంగమయూర్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు సురేంద్రరెడ్డి, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, నెల్లూరు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు, కే.వీ. రత్నం ఆప్తులు, పూర్వ విద్యార్థినీ విద్యార్థులు, రత్నం విద్యాసంస్థల సిబ్బంది, అధిక సంఖ్యలో స్థానిక హరనాథపురం, శ్రీకృష్ణ అవెన్యూలోని కే.వీ.రత్నం నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కే.వీ.రత్నం సతీమణి పద్మావతి రత్నంని, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చి వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆయనెంతో సౌమ్యులు..సజ్జనులు

### --- కే.వీ.రత్నం మృతికి వెంకయ్య సంతాపం ---



నెల్లూరులో రత్నం విద్యాసంస్థల స్థాపన ద్వారా విద్యారంగంలో జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసి, రత్నం మాస్టారుగా సుపరిచితులైన సౌమ్యులు, సజ్జనులు కె.వి. రత్నం పరమపదించారని తెలిసి ఎంతో విచారించానంటూ భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటన ద్వారా కేవీ రత్నం సారుకి నివాళులర్పించారు.

వ్యక్తిగతంగా వారు తనకెంతో ఆత్మీయులని, తానంటే ఎంతో అభిమానం చూపేవారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగంలో ఆయన చొరవను తనెంతగానో అభిమానించేవాణ్ణని ఆయన తెలిపారు. విద్య కేవలం మార్కుల కోసం మాత్రమే కాదు, విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి అనే ఏకాభిప్రాయం తమ ఇద్దరిలో ఉండేదని, ఉన్నత ప్రమాణాలను ఆచరిస్తూ, విలువలు, సంప్రదాయాలతో ముందుకు సాగిన రత్నం జీవితం, వ్యక్తిత్వం, కార్యదీక్ష, నిబద్ధత ముందు తరాలకు ఆదర్శనీయమైనవని వెంకయ్య తెలిపారు. గతంలో ఉపరాష్ట్రపతిగా నెల్లూరు పర్యటనలో ఉన్నప్పుడు శ్రీ రత్నం ఆరోగ్యం బాగాలేదని తెలిసి వారి ఇంటికి వెళ్ళి మరీ పరామర్శించానని, ఇటీవల వారి కుటుంబసభ్యులు కలిసినప్పుడు కూడా ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు వాకబు చేస్తూనే ఉన్నానని, అయితే ఇంతలోనే వారు పరమపదించారన్న సమాచారం అత్యంత బాధాకరమని ఆయన బాధను వ్యక్తం చేశారు. రత్నం మరణవార్త విన్నంతనే వారి కుమారులు వేణుగోపాల్, కృష్ణకిశోర్‌లకు ఫోన్ ద్వారా తన సంతాపం తెలియజేశానన్నారు.

కేవీ రత్నం ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన తీరు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన ద్వారా విద్యాదానం పొందిన వారు ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగి, దేశవిదేశాల్లో గొప్ప స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలకు బాటలు వేసిన శ్రీ కె.వి.రత్నం ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని వెంకయ్యనాయుడు తమ సంతాపాన్ని వెలిబుచ్చారు.

## ఢిల్లీ సీఎం..కేజ్రీవాల్ అరెస్ట్

- మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం



ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆప్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారని ఇప్పటిదాకా ఉన్న ఊహాగానాలకి తెరపడింది. ఈడీ అధికారులు 21వ తేదీ గురువారం రాత్రి ఆయన్ను అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో ఇది కీలక పరిణామంగా మారింది. 12 మంది అధికారులతో కూడిన ఇ.డి బృందం తొలుత ఆయన ఫోన్‌ను సీజ్ చేశారు. రెండుగంటల పాటు విచారించిన తర్వాత అదుపులోకి తీసుకున్నారు. మద్యం పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అవినీతి అక్రమాలు జరిగాయని, ఈ కేసులో ఆయన విచారణకు రావాలని ఇప్పటికే తొమ్మిదిసార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ హాజరయ్యేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించకపోవడం, అరెస్టు నుంచి మినహాయింపు కల్పించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించడం, ఆ తర్వాత గంటల వ్యవధిలోనే ఇ.డి అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ విషయంలో కేజ్రీవాల్ తరఫున న్యాయబృందాలు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించనున్నట్లు సమాచారం.




లాయర్
మార్చి 22, 2024

# 'ఉచితాల'పై సర్వత్రా చర్చోపచర్చలు

ఎన్నికల వేళ మళ్ళీ 'ఉచితాల'పై దేశవ్యాప్తంగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఓటర్లకు గాలం వేసి సులభంగా తమవైపు తిప్పుకోవడానికి ఈ ఉచితాలే తరుణోపాయమని అనేకమంది నాయకులు భావిస్తున్న తరుణంలో, ఇలాంటివి ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగకరమంటూ సుప్రీంకోర్టులో తాజాగా ప్రజాప్రయోజన వ్యాజ్యంగా ఓ పిల్ దాఖలు కావడం సంచలనం కలిగిస్తోంది. ఉచితాలు అనుచితమని, ఎన్నికలప్పుడు రాజకీయపార్టీలు ప్రకటించే ఉచిత హామీలు, తాయిలాలు వగైరాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని, ప్రజాస్వామ్య విలువలకు అవి విఘాతం కలిగిస్తాయని పేర్కొంటూ, అలాంటివాటిని రద్దుచేయాలని కోరుతూ, న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ఆ పిల్‌ను దాఖలు చేయడం, మరో సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా పిటిషనర్ తరఫున సుప్రీం కోర్టులో తన వాదన వినిపించడం జరిగాయి. సార్వత్రిక ఎన్నికల తొలివిడతలో భాగంగా ఈనెల 20న బుధవారం నాడు 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 నియోజక వర్గాలకు లోక్‌సభ తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజే, సుప్రీంకోర్టులో ఈ ఉచితాలపై పిల్ దాఖలు కావడం విశేషం. ఈ పిల్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించడంతో ఇక దీనిపై త్వరలోనే ఒక స్పష్టత వస్తుందని అందరూ భావిస్తున్నారు.

ఎన్నికల్లో గెలవడానికి.. ఏదో ఒక విధంగా ఓట్లు వేయించుకోవాలనే ఆత్రుతతో నాయకులు అప్పటికప్పుడు అవి చేస్తాం..ఇవి చేసేస్తామంటూ ఊకదంపుడు మాటలతో పాటు ఉచిత వాగ్దానాలు కూడా చేసేస్తుంటారు. శుష్క వాగ్దానాలు.. శూన్యహస్తాలు అనే సామెతగా, ఎన్నికలప్పుడు ఇచ్చే హామీలకు, గెలిచిన తర్వాత చేసే పనులకు పొంతన ఉండడం లేదు. నమ్మేవారుండాలే కానీ చెప్పేవారికేం లోటు లేదు అన్నట్లుగా అనేకమంది నాయకులు ఎంతోకాలంగా మభ్యపెట్టే మాటలతోనే పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ నిధులతో చేపట్టే పథకాలపై రాజకీయ పార్టీలు ఇచ్చే అసంబద్ధమైన హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని, ఇది నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు ఆటంకమేనని ప్రముఖ న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ పిల్ వేయడంతో, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దానిని పరిశీలించి, ఇదెంతో ముఖ్యమైన అంశమని భావించి, దానిని పరిగణనలోకి తీసుకోవడం హర్షదాయకం. రాజకీయంగా లబ్ది పొందేందుకు ఉచితహామీల వంటి ప్రజాకర్షణ చర్యలు రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తాయని, వాటిపై నిషేధం విధించాలని పిటిషనర్ కోరారు. అనేక అంశాలను దీనితో పాటు విశదీకరించారు కూడా. దీనిపై విచారించేందుకు సుప్రీం సుముఖంగా ఉండడం ఇప్పుడు ఉచితాలను నమ్ముకున్న రాజకీయవర్గాలను కుదిపేస్తోంది. పలు రాష్ట్రాల్లో నాయకులు ఎప్పుడో వచ్చే ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని ముందస్తుగానే ఉచితాల పేరుతో పథకాలనో, తాయిలాలనో జనానికి పప్పుబెల్లాలుగా పంచేసి, తద్వారా ఓట్లను కొల్లగొట్టడానికి వ్యూహాలు సిద్ధం చేసుకోవడం బహిరంగ రహస్యమే. అధికారంలో ఉన్నవాళ్ళకి ఇదో మంచి వెసులుబాటుగా తయారైంది కూడా. అభివృద్ధిని పట్టించుకోకుండా, ఓట్ల కోసం ముందుగానే ప్రజల డబ్బును ఉచితంగా ఏదోవిధంగా పంపకాలు చేసేయడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు జనంలో ఉన్నాయి. ఇలాంటివి సముచితం కాదనే వాదనలూ అనేకప్రాంతాల్లో వినిపిస్తున్నాయి. అభివృద్ధిని పట్టించుకోకుండా, కేవలం ఉచిత పథకాలు లేదా తాయిలాలతో కాలం గడిపేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని,.. 'చేపను ఉచితంగా ఇవ్వడం కాక..చేపను పట్టే విధానాన్ని నేర్పితే మంచిదన్నది విజ్ఞుల మాట. అంతేకాదు, 'ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న ఈ ఉచితాలు ఒకరకంగా ఓటర్లకు లంచాలు ఇవ్వడం లాంటిదేనని, అధికారపార్టీ మళ్ళీ అధికారంలోకి రావడానికి ఇదో మార్గంలా పనికొస్తుందని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఇలాంటి ధోరణులకు చెక్ పెట్టాలని' కూడా పిటిషనర్ ఈ సందర్భంగా సుప్రీంను కోరారు. ఉచిత వాగ్దానాలిచ్చే రాజకీయపార్టీల గుర్తింపును రద్దుచేసి, వారి ఎన్నికల గుర్తులను స్తంభింపజేయాలని కూడా పిటిషనర్ అభ్యర్థించారు. దీంతో దేశంలో సర్వత్రా ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నాయి. అధికార పార్టీలతో పాటు ప్రత్యర్థి లేదా ప్రతిపక్ష పార్టీల వారిలోనూ ఇలాంటి సంస్కృతి ఆవరిస్తోంది. ఒకరు వందిస్తామంటే మరొకరు రెండువందలిస్తామంటారు. తాజాగా వేసిన పిల్‌తో, ఈ ఉచితాలు నిజంగా ఎంతవరకు సమంజసం, ఏది సముచితం-ఏది అనుచితం అన్నది కొద్దిరోజుల్లోనే సుప్రీం తేల్చేస్తుందనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.




# నకిలీ ప్రచారాలతో జాగ్రత్త!

ఎన్నికల కోడ్ రావడంతో దేశమంతా ఎన్నికల కోలాహలం మిన్నుముడుతోంది. ప్రధాన పార్టీలన్నీ ఎలాగైనాసరే ఈ ఎన్నికల్లో గెలవాలని ఎవరి వ్యూహాల్లో వారు తలమునకలై ఉన్నారు. కొందరు నాయకులు అవతలివారిని ఓడించాలని టక్కుటమారాది విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. దేశంలో ఎక్కడ చూసినా ఆయా ప్రాంతాల్లో ఎన్నికల మాటలే వినిపిస్తున్నాయి. ఎవరు నిలుస్తారు, ఎవరు గెలుస్తారనే ఊహలతోనే పొద్దు గడిచిపోతోంది. గతంలో ఓట్లను అభ్యర్థించేందుకు నాయకులు నానా తంటాలు పడేవారు. తమకు ఓటేయాలంటూ ఇల్లిల్లూ తిరిగి కరపత్రాలు పంచేవారు. తమ అనుచరులతో కలసి సభలు సమావేశాలు నిర్వహించి ఓటర్లను ఆకర్షించేవారు. తమ గెలుపు కోసం ఎవరిస్థాయిలో వారు ప్రచారాలు చేసుకునేవారు. నాయకులే కాదు, వారి కుటుంబసభ్యులు, బంధువర్గాలు కూడా రంగంలోకి దిగి తమవారికి ఓటేయమని కోరేవారు. ఇప్పుడా పాతకాలం ప్రచారాలకు చెల్లిపోయింది. అరచేతిలోకి ప్రపంచం వచ్చాక, అది ఏ సమాచారమైనా కోటానుకోట్ల మందికి చేరే సాంకేతికత అందుబాటులోకి రావడంతో, ఎవరితోనైనా నేరుగా మాట్లాడడం, లేదా ప్రత్యక్షంగా వీక్షించడం వంటివన్నీ సులువైపోయాయి. దీంతో ఎక్కడో ఉన్న ఓటరు దగ్గరకి వెళ్లి మాట్లాడేకన్నా, వారితో ఫోన్‌లలో మాట్లాడి, వాట్సాప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు ఇవ్వడం అలవాటైపోయింది. నేటి ఆధునిక కాలంలో నిద్రమంచం లేచింది మొదలు అందరికీ స్మార్ట్ ఫోన్‌లతోనే పని. వాటిని చూడకుండా ఉండలేని పరిస్థితి. ఏ చిన్న సమాచారం కావాలన్నా అంతర్జాలం (ఇంటర్‌నెట్)లో వెదుక్కునే దుస్థితి. ఇదే అవకాశంగా కొందరు నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ యాప్‌లు కూడా పెట్టి, సైబర్ నేరాలకు కూడా పాల్పడుతూ ఎంతోమందిని మాయచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో మోసపూరిత ప్రకటనలిచ్చి, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న కొన్ని వెబ్‌సైట్లను ఇటీవలే సంబంధిత అధికారసంస్థలు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి కూడా. కొల్లలుగా వస్తున్న రకరకాల యాప్‌లు, వెబ్‌సైట్లతో ప్రజలకు దిమ్మతిరుగుతోంది. అంతర్జాల మాయాజాలంలో వేటిని నమ్మాలో, ఏది నమ్మకూడదో సామాన్యులకు అంతా అయోమయంగా తయారైంది. రాజకీయంగా కూడా ఫోన్‌లలో వస్తున్న అనేకానేక సమాచారాల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోవాలంటే అపారజ్ఞానం ఉండాలి. సామాన్యులకు అవన్నీఎక్కడ తెలుస్తాయి. తాము వినేదే, లేక చూసేదే నిజమని అనుకునేవారికి లెక్కేలేదు. దీంతో స్మార్ట్ ఫోన్‌ల ద్వారా ప్రచారాలు చేసుకోవడం, ఎక్కడ సభ పెట్టినా దేశమంతా ప్రసారమవుతుండడం పార్టీలకు కలసివచ్చిన అదృష్టంగా మారింది. నాయకులు కూడా లేనిపోని వ్యయప్రయాసలు లేకుండా, సమయం వృథా కాకుండా సామాజిక మాధ్యమాలను నమ్ముకుని గోరంత ప్రచారాలను కొండంతగా చూపించుకుంటున్నారు. ఎన్నికల్లో గెలవాలనే ఆశతో ఉన్నది లేనట్లూ, లేనిది ఉన్నట్లుగా కూడా ప్రచారాలు చేసుకోవడం రాజకీయరంగంలో అనేకమందికి మామూలైపోయింది. కొంతమంది నాయకుల సభలకు జనం పెద్దగా రాకున్నా అటూఇటూ తిప్పితిప్పి చూపిస్తూ అంతా జనమయంగా చెప్పుకునేస్తున్నారు. అటు టీవీల్లోనూ, ఇటు సోషల్ మీడియాలోనూ అలా భారీగా ప్రచారాలు చేసుకోవడమే సులభమంటూ అనేకమంది నాయకులు ఆ బాట పట్టడంతో ప్రసార మాధ్యమాలకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చేసింది. ఇదే అదనుగా సామాజిక మాధ్యమాలూ వీరంగం చేస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ వర్గాలకు నిమిషం కూడా నిద్రపట్టడం లేదు. ప్రచారాలే ఇప్పుడు ప్రధానం కనుక, అందరి దృష్టీ సామాజిక మాధ్యమాలమీదే ఉంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికారంలో ఉన్నవారితో పాటు ప్రతిపక్షాల వారు కూడా తామేమీ తక్కువ తినలేదంటూ ప్రచారార్భాటాలను ముమ్మరం చేస్తున్నారు. అనేకమంది తెలివిగల నాయకులు ఆన్‌లైన్ ప్రచారాల్లో ఎక్కువగా ఫేస్‌బుక్, యూట్యూబ్‌లనే వేదికగా ఎంచుకుంటున్నారు. టీవీల్లో తమ పార్టీ గొప్పతనాన్ని చెప్పుకుంటూ అవతలి పార్టీ వైఫల్యాలను దుయ్యబడుతూ చిత్తం వచ్చిన రీతిగా మాట్లాడుతుండడం, వాటిని వీక్షకులు భలే ఆసక్తిగా చూస్తుండడం వంటివన్నీ కూడా నిత్యకృత్యమైపోయాయి. మొత్తంగా, నేటి రోజుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం బలీయంగా ఉంటోంది. అంతేకాదు, ఇదే సందర్భంలో పచ్చిఅబద్ధాల ప్రచారం, నోరుంది కదా అని బూతులు మాట్లాడడం కూడా కొందరు నాయకులకు మామూలైపోయింది. అలా మాట్లాడడాన్ని జనం ఎంతగా చీదరించుకుంటున్నారో వారు పట్టించుకోవడం లేదు. ఏదేమైనా, ఈ ఎన్నికల రోజుల్లో ఫేక్ వార్తలు, నకిలీ సమాచారం జనాల్లోకి పోకుండా జాగ్రత్తలు తీసుకోకుంటే చర్యలు తప్పవని, అలాంటి మోసపు సమాచారాన్ని కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను, అధికారులను కూడా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. వారి నిఘాలో ఏదైనా సమాచారం అసంబద్ధమని తేలితే చర్యలు తప్పవు కనుక ఈ ఎన్నికల వేళ ప్రచార, ప్రసార సాధనాలు తగు జాగ్రత్తలతో ఉంటూ నిజాలకు వేదికలుగా తమ మాధ్యమాలను మార్చుకోవడం ఎంతైనా శ్రేయస్కరం. ప్రజలు కూడా విజ్ఞతతో ఏది మంచో ఏది చెడో గ్రహించాల్సిన కీలకమైన సమయం కూడా ఇదే.

- రాజశ్రీ

# కూటమి కష్టాలు ఎవరికి?

ఆంధ్రాలో రాబోయే ఎన్నికలలో టీడీపీ – జనసేన కూటమే గెలుస్తుందని మొన్నటివరకూ చాలామంది విశ్లేషకులు చెప్తూవచ్చారు. ఇప్పుడు వారిద్దరితో బీజేపీ కూడా జతకట్టాక పరిస్థితులు తారుమారయ్యాయని అదే విశ్లేషకులు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉంది. మైనారిటీల ఓట్లతో పాటు క్రిష్టియన్ ఓట్లు కూడా ఖచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డికే పడతాయన్నది వారి వాదన. వారి వాదనతో నేను ఏకీభవించడం లేదు. ఎందుకంటే ఇదంతా కేవలం ఆ మతాలకి బీజేపీ వ్యతిరేకం అన్న భావన కల్పించడం కోసం కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారం. ఆలా అనుకుంటే రామ మందిరాన్ని నిర్మించి హిందుత్వానికి బ్రహ్మరథం పడుతున్న నరేంద్ర మోడీ నాయకత్వాన్ని హిందువులందరూ బలపరచరన్నది వారి అభిప్రాయమా? అంటే మైనారిటీలకి, క్రైస్తవులకు వారి మతాలపై ఉన్నంత మతాభిమానం హిందువులకి లేదని వారి ఉద్దేశమా? హిందువులు మరీ అంత పనికిమాలినవాళ్ళా? ఆ మతాలవాళ్ళు భావించినట్లు హిందువులు కూడా భావించి ఎన్.డి.ఏ కూటమిని బలపరిస్తే ఫ్యాను గాలికి కొట్టుకుని పోవాల్సిందే. ఆంధ్రాలో కుల రాజకీయాలే తప్ప మత రాజకీయాలు లేవు. ఒకవేళ అవే ఉంటే రేపటి ఎన్నికలలో నెల్లూరు నగరంలో ఖలీలే గెలవాలి. నాకు తెలిసినంత వరకూ ఆంధ్రా ఓటర్లు చాలా విజ్ఞత కలిగినవాళ్ళు. ఏ సమయంలో ఎలా ఓటెయ్యాలో వాళ్లకి బాగా తెలుసు. గతంలో కొన్ని సందర్భాలలో క్రాస్ ఓటింగ్ చేసి ఆంధ్రాలో టీడీపీని, కేంద్రంలో జాతీయపార్టీ కాంగ్రెస్‌ని గెలిపించిన మేధావులు ఆంధ్రా ఓటర్లు. జగన్ మోహన్‌రెడ్డి తానిచ్చిన పథకాలపైనా, బాబు కూటమి జగన్ ప్రభుత్వ వ్యతిరేక పవనాలపైనా ఆధారపడాల్సిందే తప్ప.. ఆంధ్రాలో మత రాజకీయాలు పనిచేయవు!

యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# ఓట్ల పండుగ వచ్చేసింది

ఓట్ల పండుగ వచ్చేసింది. ఓటరే రాజు..మహారాజు కూడా. నాయకులకు కూడా ఇది పండగే. ప్రచారార్భాటాలు ఇక సరేసరి. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు నాయకులు అన్నిరకాల టక్కుటమారాది విద్యలు ప్రదర్శిస్తుంటారు. తాయిలాలిస్తామంటూరు.. డబ్బులిస్తామంటారు. ఎక్కడ చూసినా డబ్బు రాజకీయాలే వీరంగం చేస్తుంటాయి. మేం గెలిస్తే మీకు ఏ కష్టం లేకుండా చేసేస్తాం అంటూ నమ్మబలుకుతారు. రకరకాల హామీలిచ్చేస్తారు. అరచేతిలో స్వర్గం చూపిస్తారు. గెలిచాక ఇంక కనిపించరు. ఈ సంగతులన్నీ ప్రజలకు బాగా తెలిసినవే. అనుభవంలోకి వచ్చినవే. ప్రజలు ఈ దశలోనే అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి. అక్రమాలను, అన్యాయాలను ఎదిరించే ఆయుధం ఓటే. మంచినేతలను ఎన్నుకునేందుకు, తద్వారా సమాజం అన్నివిధాలా బాగుండేందుకు ఓటే కీలకం. అందుకే ఓటర్లు తప్పకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

– కె. బాలకృష్ణయ్య, తోటపల్లిగూడూరు.

## సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై

# కొనసాగుతున్న సస్పెన్స్!



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాత, కొత్త జిల్లాల నుండి పోటీచేయబోయే ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితాని అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ దాదాపుగా ప్రకటించేశాయి. అయితే, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరన్నది ఆ పార్టీ ఇంకా ఖరారు చేయలేదు. వైసీపీ అభ్యర్థిగా కాకాణి పేరుని వైసీపీ అధికారికంగా చెప్పేసింది.

సర్వేపల్లి నియోజకవర్గ నాయకుడిగా, పోరాటయోధుడిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గడచిన అయిదేళ్ళుగా వైసీపీ పైన తిరుగుబాటు చేస్తూనేవున్నారు. ముఖ్యంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి నోటికి అడ్డూ ఆపు లేకుండా చవకబారు ఆరోపణలు చేస్తున్నా ఆ అవమానాలను చంద్రమోహన్‌రెడ్డి భరిస్తూనే వస్తున్నారు. ఇప్పుడు టీడీపీ అధిష్టానం చంద్రమోహన్‌రెడ్డి పేరుని ఇంకా ప్రకటించకపోవడంపై ఆ నియోజకవర్గంలో నిరసన గళాలు వినపడుతున్నాయి. కుంటి సాకులతో, కక్కుర్తి కుట్రలతో తమ నాయకుడిని పక్కన పెడితే తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని నియోజకవర్గ ద్వితీయశ్రేణి నాయకులు, పార్టీ కార్యకర్తలు శపథం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం కళ్ళు తెరచి వెంటనే తమ నాయకుడి పేరుని ప్రకటించాలని కోరుతున్నారు. అధిష్టానం సోమిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తే ఈసారి ఆయనని అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామన్న సందేశాన్ని పార్టీ అధిష్టానానికి పంపుతున్నారు. మరో రెండురోజుల్లో సోమిరెడ్డి పేరే టీడీపీ అధిష్టానం ప్రకటించబోతుందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. చూడాలి ఏం జరుగుతుందో ...!

# రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 20వ తేదీ బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అంకురార్పణ జరిగింది. తొలుత స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, జిల్లా అధికారుల సారధ్యంలో, భక్తబృందాల సహకారంతో ఈ ఉత్సవాలు మార్చి 30వ తేదీ వరకు వైభవోపేతంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక ఆలయ నిర్వాహకులు, జిల్లా అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 25న బంగారు గరుడసేవ, 26న కల్యాణోత్సవం, 27న అంగరంగ వైభవంగా స్వామివారి రథోత్సవం భక్తులకు కన్నులపండుగ చేయనున్నాయి.

# మెడికవర్ ఆసుపత్రిలో..గుండెకు అరుదైన చికిత్స




నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో క్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సను ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈనెల 20న ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ సంజీవ్ సురేష్ మాట్లాడుతూ, కడపజిల్లాకు చెందిన ఏ. పుల్లారెడ్డి అనే 52 ఏళ్ళ వ్యక్తి గుండెమంట, ఆయాసంతో తమ ఆసుపత్రికి వచ్చారని, వైద్యపరీక్షలు చేసి చూస్తే, గుండెకు రక్తం సరఫరా చేసే నరాలు ఎడమవైపు 90 శాతం దాకా, కుడివైపు నూరుశాతం దాకా మూసుకుపోయి ఉన్నాయని తెలిపారు. దీంతో, అత్యవసరంగా బైపాస్ సర్జరీ చేయాలని నిర్ధారించామని, ఎంతో క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను జయప్రదంగా నిర్వహించామని చెప్పారు. దీంతో రోగి కేవలం రెండురోజుల్లోనే కోలుకున్నారని తెలిపారు. గుండెకు రెండువైపులా రక్తాన్ని సరఫరా చేసే నేరాలు దాదాపుగా మూసుకుపోయిన పరిస్థితుల్లో శస్త్రచికిత్స ఎంతో కష్టమైన ప్రక్రియ అని వారు పేర్కొన్నారు. రోగి పుల్లారెడ్డితో కలసి నిర్వహించిన ఈ సమావేశంలో మత్తువైద్య నిపుణుడు డాక్టర్ వెంకటరమణచౌదరి తదితరులు పాల్గొన్నారు.




# కలిసికట్టుగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



అందరం కలిసికట్టుగా పనిచేద్దాం..విజయం సాధిద్దామంటూ వెంకటగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వైకాపా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను అభ్యర్థిం చారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు కలిసినా తమ పార్టీకి ఏమీ నష్టం లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి వైకాపాకు అఖండ మెజార్టీ వచ్చేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ, కల్లబొల్లి మాటలు చెప్పి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చేసిన వారు రాపూరు అభివృద్ధిని విస్మరించారని, మంచి మనస్సున్న వ్యక్తి నేదురుమల్లి రామకుమార్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి చేసి చూపిస్తారన్నారు. ఈ రెండు నెలలు కలిసికట్టుగా పనిచేద్దామని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని కోరారు.

# షట్టర్ గేట్ల బిల్లుల్లోనూ అక్రమాలు

**విచారణ జరిపించాలన్న మిడతల**



కనుపూరు కాలువ నుండి పంట పొలాలకు నీరు అందించే తూముల షట్టర్ గేట్లకు సంబంధించి జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఇటీవల నెల్లూరు డిఆర్‌ఓ లవన్నకు విజ్ఞప్తి చేశారు. జలవనరుల శాఖ పరిధిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ద్వారా నిధులు తీసుకొని, అదే పనులకు ఎఫ్డీఆర్ పనుల కింద రెండవ సారి నిధులు డ్రా చేశారని, కనుపూరు కాలువ నుండి సాగునీటి కాలువలకు-దాని ద్వారా బ్రాంచి కాలువలకు-తద్వారా పంట పొలాలకు నీరందించేందుకు సుమారు 500 షట్టర్లు అమర్చి ఉన్నాయని, ఒక్కొక్క షట్టర్ ప్రమాణం 20 సంవత్సరాలు కాగా, అవి మరమ్మతులకు గురైతే జల వనరుల శాఖ కార్యాలయంలో వాటిని అప్పగించాలని, ఆ విధంగా అప్పగించకుండా వాటికి రంగు పూసి కొత్తగా అమర్చినట్లు బిల్లులు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. షట్టర్ల నిధుల దుర్వినియోగంపై అధికారుల పాత్ర ఉందని అనుమానం కలుగుతోందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు.

# పల్లిపాడు 'డైట్'కు ఫర్నిచర్ బహుకరణ



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ డైట్ (జిల్లా విద్యా శిక్షణ సంస్థ)కు 1993-93 బ్యాచ్ టీటీసీ పూర్వ విద్యార్థుల బృందం ఫర్నిచర్, వైట్ బోర్డు, షటిల్‌బ్యాట్‌లు, సెమినార్ హాల్ నేమ్‌ప్లేట్ వగైరాలు బహుకరించారు. ఈ సందర్భంగా వారు డైట్‌ను సందర్శించి, 30 ఏండ్ల నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. అప్పటి సహోధ్యాయులను, అధ్యాపకులను జ్ఞాపకం చేసుకున్నారు.అప్పుడు టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు చేసిన అందరూ దాదాపు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారని, తాము జీవితంలో స్థిరపడడానికి కారణమైన సంస్థకు తమ వంతు కృతజ్ఞతగా ఛాత్రోపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ఫర్నిచర్ సమకూర్చినట్లు వారు తెలిపారు. డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ ఆర్.బాలాజీరావు, ఉపన్యాసకులు కె.విజయచంద్ర, యస్.బి.దాస్, యస్.శివ, సి.సోమేశ్వర్, కె.షఫీఅహ్మద్, కార్యాలయ సూపరింటెండెంట్ యస్.సురేష్, కార్యాలయ సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దినేష్‌రెడ్డికి పదవి



కోవూరు తెలుగుదేశం నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి టీడీపీ లో జాతీయ అధికార ప్రతినిధిగా పదవి లభించింది. కోవూరు నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ చేయనున్న నేపథ్యంలో దినేష్‌రెడ్డిని టీడీపీ అధిష్టానం జాతీయస్థాయి పార్టీ పదవిలో నియమించింది. పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఈనెల 19న ఆమేరకు ఉత్తర్వులిచ్చారు.

**ఉత్తమ సేవలందించిన**

# పోలీసులకు పతకాలు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్రప్రభుత్వం ఈనెల 19న పతకాలను ప్రకటించింది. నెల్లూరు సీఐడి డీఎస్పీ కె.వేణుగోపాల్‌కు ఉత్తమ సేవా పతకం, ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, స్పెషల్‌బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఏ. మల్లికార్జునరావు, దర్గామిట్ట-పొదలకూరు-చిన్నబజారు హెడ్‌కానిస్టేబుళ్లు జి.భాస్కర్‌రావు, బీవీ సుబ్బారావు, బీవీ వినోద్ కుమార్‌లకు, కావలి అగ్నిమాపకశాఖలో పనిచేస్తున్న ఫైర్‌మెన్ సిహెచ్ నారాయణకు సేవా పతకాలను ప్రకటించింది. ఈ పతకాలను ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో బహూకరించనున్నారు.

# నేత్రదానం



నెల్లూరు గోమతినగర్‌కు చెందిన పూనూరు జయరామిరెడ్డి (88) అనారోగ్యంతో ఈనెల 18వ తేదీ ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మరణానంతరం నేత్రదాన మోటివేటర్ దేవెళ్ళ శ్రీనివాసులరెడ్డి సమాచారంతో ప్రభుత్వాసుపత్రి ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్‌విప్రసాద్ నేత్రవైద్యశాల టెక్నీషియన్ బి.లాలేష్‌లు ఆయన కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను (కార్నియా)ను సేకరించినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ-ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఎం. శర్వాణి ఒక ప్రకటనలో తెలిపారు.

**విపిఆర్‌తో**

# బీజేపీ నేతల భేటీ

నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి నుంచి పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈనెల 18న జిల్లా బీజేపీ నాయకులు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఆయన నివాసానికి వచ్చి కలిశారు. జిల్లాకు సంబంధించి పలు రాజకీయ అంశాలను చర్చించుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, నాయకులు సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి

**- ఆనం రామనారాయణరెడ్డి**



రాష్ట్రంలో మాఫియాల పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, ఆ విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని మాజీమంత్రి, ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 16న ఆత్మకూరులోని ఓ కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో మద్యం, ఇసుక, గ్రావెల్, గంజాయి మాఫియాలు, భూ ఆక్రమణల అక్రమాలు పెరిగిపోయాయని విమర్శించారు. రేపటి తరానికి వెలుగుబాటలు వేసే చంద్రబాబునాయుడు నాయకత్వం రాష్ట్రానికెంతో అవసరమని స్పష్టం చేశారు.

# గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

**- నగర ప్రజలకు టీడీపీ నేత నారాయణ భరోసా -**



రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే, బాధ్యతగా నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేస్తానని తెలుగుదేశం-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి పొంగూరు నారాయణ ప్రజలకు భరోసా ఇస్తున్నారు. ఈనెల 19వ తేదీ ఆయన నగరంలోని 43వ డివిజన్ జెండావీధి ప్రాంతంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ అయిదేళ్ల వైకాపా పాలన అంతా అవినీతి అక్రమాల మయంగా మారిందని, తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. వైకాపా నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మకుండా ప్రజల అభివృద్ధిని ఆకాంక్షించే తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయాలని, ఈ ఎన్నికల్లో బీజేపీ-తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంటు స్థానానికి పోటీలో ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేయనున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తాము గెలిస్తే, నెల్లూరు నగరానికి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతామన్నారు. అనంతరం స్థానిక ప్రజలకు పార్టీ కరపత్రాలనందజేశారు.

**ఆత్మకూరు నుంచి**

# అరుణాచలంకు ప్రత్యేక బస్సు

మార్చి 25 పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరి ప్రదక్షణకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం నెల్లూరుజిల్లా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీబస్సును నడుపనున్నామని డిపో మేనేజర్ కరీమున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి ఆ బస్సు తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి బయలుదేరుతుందని, దారిలో కాణిపాకం, సిరిపురం, అరుణాచలం గిరి ప్రదక్షణలకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాను, పోను టిక్కెట్ ధర రూ. 1400గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# 'అమరజీవి' త్యాగనిరతి అపూర్వం



ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వెలకట్టలేనిదని, తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఎల్లప్పుడూ పదిలమని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఈనెల 16న నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో ఉన్న అమరజీవి విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం అపూర్వమన్నారు. స్వాతంత్య్ర సమరంలో ఎన్నో ఉద్యమాల్లో శ్రీ పొట్టి శ్రీరాములు గాంధీజీ వెంట నడిచారన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఆయన ప్రాణత్యాగం ఫలితమేనన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## డా.కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో..

# వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం హైస్కూల్స్‌లో ఇటీవల 'చిల్డ్రన్స్ కాన్ఫరెన్స్' పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు రూరల్, అర్బన్ మండల విద్యాశాఖ అధికారులు భిక్షోలు, తిరుపాలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఈ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు సుమారు 150 వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించగా, అవన్నీ అద్భుతంగా ఉన్నాయంటూ వారు అభినందించారు. చంద్రయాన్, హైడ్రాలిక్ బ్రిడ్స్, మిలిటరీ రోవర్, కార్డియాక్ సైకిల్, రాకెట్, పిండ దశలు, సైకిల్ రోబోట్ కెమికల్స్‌తో చెమేలియన్ తదితర నమూనాలను సందర్శకులను బాగా ఆకట్టుకున్నాయి. డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, జూనయర్ మేనేజర్ అజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకు ఆత్మీయ పురస్కారాలు



నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో ఈ నెల 17న ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు..'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య కుటుంబాలవారికి ఆత్మీయంగా సేవా ప్రతిభా పురస్కారాలను బహుకరించారు. భక్తి సంగీత కళాకారుడు, గురువు గుండాల గురవయ్యతో పాటు విడుపులపాటి సురేష్, శారద, చంద్రకళ, జ్యోత్స్న, శ్రీరామ్‌స్వప్న, వాయుగుండ్ల రోషితలను సన్మానించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఏప్రిల్ 9 నుంచి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ముక్కాల ఈ సందర్భంగా తెలిపారు. ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలు ఆరోగ్యానికెంతో మేలు



చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగజేస్తాయని నెల్లూరు బాలాజీనగర్ సెక్టార్ రాయపుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ్ పక్వాడ్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ ఎం. నాగేశ్వరి చెప్పారు. ఇటీవల ఆమె అంగన్‌వాడీలతో కలసి పలు ప్రాంతాల్లోని గర్భవతులు, బాలింతలు, రెండేళ్ళలోపు చిన్నారుల తల్లితండ్రుల ఇళ్ల వద్దకు వెళ్ళి వారికి పోషకాహారం పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విలువైన పోషకాహారాలు ఉన్న చిరుధాన్యాలతో పలురకాల ఆహారపదార్ధాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.అరుణ, ఆర్.కామాక్షమ్మ, ఎం.పద్మమ్మ, బి.జయలక్ష్మమ్మ, డి.ముకుంద తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## కుళాయి పన్ను కట్టకుంటే..

# కనెక్షన్ కట్ చేయండి

### అధికారులకు కమిషనర్ ఆదేశం



కుళాయి పన్ను బకాయిలు చెల్లించనివారిని గుర్తించి కనెక్షన్ కట్‌చేసి నీటి సరఫరా నిలిపివేయండంటూ నెల్లూరు నగర కార్పొరేషన్ వికాస్ మర్మత్ ఈనెల 18న సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరమంతా నిరంతరం మంచినీటి సరఫరా జరగాల్సి ఉందని, అందుకు ప్రజలు పన్నులను బాధ్యతగా చెల్లించి సహకరించాలన్నారు. 2023-24 రెండవ అర్ధసంవత్సరం వరకు పన్నులపై విధించిన అపరాధరుసుము (వడ్డీ)ని ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ ఉంటుందని, బకాయి మొత్తాన్ని మార్చి 31వ తేదీలోగా ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని చెప్పారు. మొండి బకాయిదారులకు ప్రభుత్వ వడ్డీమాఫీతో వెసులుబాటు కల్పించినా, ఆ అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోనివారికి కుళాయి కనెక్షన్ కట్ చేయాలన్నారు. ఇంకొద్దిరోజుల్లో మార్చి నెల ముగుస్తున్నందున పన్నుల వసూళ్ళ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు.

# విద్యార్థుల సమాజసేవ గర్వకారణం

### - వీఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి -




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యు)లో సంఘ సంక్షేమ కృషి విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవాన్ని ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జీ.ఎం సుందరవల్లి పాల్గొన్నారు. యూనివర్సిటీలో అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం పట్ల ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, సోషల్ వర్క్ విభాగం నాలుగు గోడల మధ్య తరగతి గదికే పరిమితం కాకుండా సమాజంలోకి వెళ్లి సమస్యలను అధ్యయనం చేస్తూ తగు పరిష్కారం మార్గాలను సూచిస్తూ అటు విశ్వవిద్యాలయానికి, సంఘానికి విద్యార్థులు ఉపయోగపడుతుండడం మన విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. అలాగే యూనివర్సిటీలో సోషల్‌వర్క్ విభాగం ద్వారా అనేక కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహిస్తుండడం విశ్వవిద్యాలయ ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.విజయానంద్‌కుమార్‌బాబు, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ కె. సునీత తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజాగళం' సభలో భద్రతా వైఫల్యం

### విచారణ చేపట్టాలన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



చిలకలూరిపేటలోని బొప్పూడి వద్ద టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 19న ఒక ప్రకటనలో కోరారు. ప్రజాగళం సభకు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతున్నారని తెలిసి కూడా ఆయా జిల్లాల అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. భారీ సంఖ్యలో జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రాఫిక్ సమస్య జటిలంగా మారిందని, దాంతో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సమయానికి సభా ప్రాంగణానికి చేరుకోలేకపోయారని ఆమె పేర్కొన్నారు. ప్రజలు మైక్ సిస్టమ్‌పై పడటంతో పలుమార్లు ఆడియోకు అంతరాయం ఏర్పడిందని, వారిని అదుపు చేయాలని స్వయానా ప్రధానమంత్రి మోడీయే చెప్పారంటే పోలీసుల నిర్లక్ష్య వైఖరి ఎలా ఉందో అర్థం అవుతుందని ఆమె పేర్కొన్నారు. అధికారులు విఫలం కావడంపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# వినియోగదారుల హక్కుల దినోత్సవం




నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఇటీవల ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిగింది. జిల్లాలోని యువతకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా వినియోగదారుల కోర్టు జడ్జి జింకారెడ్డి శేఖర్ పాల్గొని, వినియోగదారులు డిజిటల్ నేరాల బారిన పడకుండా తమ హక్కులపై అవగాహన కలిగివుండాలని చెప్పారు. సెట్నెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వై.వెంకటయ్య మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపుల్లో పెద్దఎత్తున మోసాలు జరుగుతున్నాయని, వాటి నుంచి చట్టబద్ధమైన రక్షణ పొందే హక్కు ఉన్నా దానిని వినియోగదారులు సరిగా వినియోగించుకోవడం లేదని, ఇకనైనా హక్కులపై తగు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కృష్ణచైతన్య కళాశాల డీన్ సుధారాణి, బి.శ్రీనివాసరావు, సెట్నెల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రూ.43.50 లక్షల రుణాలు



కేంద్రప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన నేషనల్ హ్యాండి క్యాప్డ్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసి) వారి ఆర్థికసహకారంతో, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు -వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 19 మంది దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం 43.50 లక్షల రూపాయల చెక్కులను రుణాలుగా అందించారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులు మీదుగా ఆ చెక్కులను అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు-వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ అక్బర్ అలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.




# కోడ్‌తో..'స్పందన' రద్దు

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రద్దు చేశారు. అందువల్ల అర్జీలు సమర్పించడానికి ఎవరూ రావద్దని ఆయన సూచించారు. అదేవిధంగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని జిల్లా పోలీస్ అధకారులు తెలిపారు.

# మసీదుల వద్ద పరిశుభ్రతకు చర్యలు

రంజాన్ పండుగ, ఉపవాస దీక్షలను పురస్కరించుకుని నగరంలోని మసీదుల వద్ద నెల్లూరు కార్పొరేషన్ పారిశుద్ధ్యపనులు చేపట్టింది. ఆరోగ్యాధికారి ఎం.వెంకటరమణ పర్యవేక్షణలో అన్ని డివిజన్ల పరిధిలోని వీధుల్లో మురుగు కాలువల్లో పూడిక తీసి, పరిశుభ్రం చేస్తున్నారు.


# ఇఫ్తార్ విందు




పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని మెక్లిన్స్ రోడ్డులో ఉన్న ఎస్సార్‌ఎస్ కన్వెన్షన్‌హాల్‌లో జమాఅతి ఇస్లామి హింద్ నెల్లూరు నగరశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న ముస్లిమేతరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ, నగరాధ్యక్షుడు అన్వర్ బేగ్, పాస్టర్లు రెవరెండ్ హరిపాల్ తదితరులు పాల్గొన్నారు.











## అక్షరాలకే అ, ఆలు నేర్పించిన....

# అయ్యోరు ఇక లేరు

## రత్నం మాస్టారు కన్నుమూశారు



### దివికేగిన విద్యా శిఖరం

చదువుల తల్లి సరస్వతి దేవి ముద్దుల బిడ్డ ఇక లేరు.
కొన్ని లక్షల మందికి విద్య ద్వారా బ్రతుకుబాట చూపించిన మేధోమూర్తి స్వరం మనకిక వినిపించదు.
ఎవరికి ఏ చిన్న ఆపద వచ్చినా నేనున్నానంటూ స్పందించే సేవామూర్తి రూపం మనకిక కనిపించదు.
అందరినీ ఆప్యాయంగా పేరుపెట్టి పలకరించే తేజోమూర్తి కంఠం మననిక పలకరించదు.
రాష్ట్ర విద్యారంగానికి నెల్లూరుజిల్లాని విద్యా రాజధానిగా చేసిన నిత్య కృషీవలులు, అనితరసాధ్యులు, అనన్య సామాన్యులు
కే.వీ.రత్నం మార్చి 20వ తేదీ బుధవారం నెల్లూరు హరనాథపురంలోని తమ స్వగృహంలో కన్నుమూశారు.
ఆయన వయస్సు 81. ఆయనకి భార్య పద్మావతి రత్నం, కుమారులు వేణుగోపాల్, కృష్ణకిషోర్ ఉన్నారు.

### మారుమూల పల్లెలో జననం!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యారంగ చరిత్రలో తొలిసారిగా, తన సొంత పేరునే సంస్థ పేరుగా పెట్టుకుని 'కోచింగ్ సెంటర్' అనే పదానికి శ్రీకారం చుట్టి, 1983 నుండి తన తుదుశ్వాస వరకూ సుమారు నాలుగు దశాబ్దాలకిపైగా విద్యారంగంలో తన ప్రస్థానాన్ని కొనసాగించిన విద్యానిధి, ఎందరో విద్యార్థుల పాలిట పెన్నిధి కొర్రపాటి వెంకటరత్నం.

1943వ సంవత్సరం మే 23వ తేదీన కేవలం 40 గడపలున్న చలపనాయుడుపల్లి అనే కుగ్రామంలో కొర్రపాటి ఈశ్వరయ్యనాయుడు, తులశమ్మ దంపతుల రెండవ సంతానంగా జన్మించారు కే.వి.రత్నం. తన బిడ్డడు బాగా సదువుకోవాల, ఆ సదువు పదిమందికీ ఉపయోగపడాల అనే తన తండ్రి ఆశయానికి, ఆకాంక్షకీ అనుగుణంగా ఏదో సాధించాలనే తపనకి తన చిన్ననాడే బీజం వేసుకున్నారు రత్నం.

రత్నం మాష్టారుగా నెల్లూరుజిల్లాలోనే కాదు యావత్ ఆంధ్ర రాష్ట్రంలో నేడు ఆయనని ఎరుగనివారు లేరు. వందలాదిమంది డాక్టర్లను, వేలాది మంది ఇంజనీర్లను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా వారిని విస్తరింపజేసిన ఘనత ఆయనది. తాను చేసే ప్రతిపనిలోనూ, తాను వేసే ప్రతి అడుగులోనూ మంచినీ, మానవత్వాన్నీ ప్రతిబింబింపచేసే మాననీయ హృదయం ఆయనది.

తన స్వగ్రామంలో ఇసుకలో ఓనమాలు దిద్ది ప్రారంభించిన తన విద్యాప్రయాణం 3వ తరగతి వరకూ తన గ్రామంలోనూ, 4, 5 తరగతులు తమ అమ్మమ్మగారి ఊరు కొత్తపాళెంలోనూ సాగింది. 6 నుండీ 10వరకూ ఆత్మకూరులో చదివారు రత్నం. 6 నుండి 10వ తరగతి వరకూ ఆత్మకూరులో గడిపిన రోజులు ఎప్పటికీ మరపురావని, తమ బిడ్డలని చదివించాలని, వారిని ఉన్నత స్థానాలలో చూడాలని తల్లిదండ్రులు పడే తపన తాను ఎప్పటికీ తానూ మరువలేనని అంటూ... తనని ఆ రోజుల్లోనే ఆత్మకూరులో ఓ రూంలో ఉంచి చదివించిన తన తండ్రిని పలు సందర్భాలలో గుర్తుచేసుకుంటూ ఉండేవారు. అమ్మా, నాన్నల కలలను తీర్చడానికి వారి ప్రేమకి దూరంగా బిడ్డలు, తమ బిడ్డల ఉన్నతిని ఆకాంక్షించి వారిని దూరంగా ఉంచే తల్లిదండ్రులు, ఈ సంఘటనలన్నీ తన చిన్ననాడే తనలో బలమైన పునాదులు వేసి రెసిడెన్షియల్ ప్రాంగణాల రూపకల్పనకు నాంది పలికేలా తనను తీర్చిదిద్దాయని చెప్పేవారాయన. 'నేను డాక్టర్‌నో, సైంటిస్ట్‌నో, ఇంజనీర్‌నో కాలేకపోయినా, ఈనాడు వేలాదిమంది డాక్టర్లని, ఇంజనీర్లని, సైంటిస్టులని తయారుచేశాననే సంతృప్తి నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది' అని గర్వంగా చెప్పుకునేవారు.

ఆ రోజుల్లో 10వ తరగతి ఆత్మకూరులో పూర్తి చేశారు. 1961-62ల మధ్య పి.యు.సి చదివి అనంతరం 1963-66లో నెల్లూరు వి.ఆర్. కాలేజీలో బి.యస్సీ పూర్తి చేశారు. బి.యస్సీ కెమిస్ట్రీ డిగ్రీని అందుకోవడమేకాకుండా కెమిస్ట్రీ మెయిన్‌లో డిస్టిన్‌క్షన్ సాధించిన ఘనత రత్నంది. 1966 ఆగస్టు 16వ తేదీన ఆనం వెంకటరెడ్డి ఆశీస్సులతో తాను చదివిన వి.ఆర్.కాలేజీలోనే కెమిస్ట్రీ విభాగంలో డెమోన్‌స్ట్రేటర్‌గా నెలకు 240రూపాయల జీతంతో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు రత్నం సారు.

ఓవైపు వి.ఆర్.కాలేజీలో చదువుకుంటూనే మరోవైపు తన తరువాత తరం వారికి చదువు చెప్పాలనే బలమైన ఆలోచన "రత్నం"లో ఉండేది. తన ఆలోచనను తన మిత్రులు మస్తాన్‌రెడ్డి, విశ్వేశ్వరరావులతో పంచుకున్నారు. వారి భాగస్వామ్యంలో నెల్లూరు రజకవీధిలో "జయంతి" ట్యుటోరియల్స్ అనే సంస్థని 1966లోనే ఆయన ప్రారంభించారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ట్యూషన్లు చెప్తూ అనతికాలంలోనే తమ "జయంతికి" మంచి గుర్తింపును తీసుకు వచ్చారు. తమ సంస్థకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని కొంతమంది తమపై మేనకూరు ఆదిశేషారెడ్డికి ఫిర్యాదు చేశారు. స్వతహాగా వివాదాలకు దూరంగా ఉండే ఆయన "జయంతి" ని మూసేశారు. ట్యూషన్స్ చెప్పాలనే బలమైన సంకల్పాన్ని మాత్రం వదలలేదు. ఇంట్లోనే ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠాలు చెప్పేవారు. మాగుంట కుటుంబానికి అపార కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన రాజవీధి ఇంట్లో పైఅంతస్తులో ఓ చిన్నగదిలో బ్రహ్మచారి జీవితాన్ని గడిపారు. 1967లో తమ బంధువు పద్మావతిని పరిణయమాడారు. అనంతరం హరనాథ పురంలో నెలకు 25రూపాయల బాడుగకు కమలమ్మ ఇంట్లో చేరారు రత్నం అయ్యవారు.

### అలుపెరుగని ప్రస్థానం!

1976లో మొట్టమొదటసారిగా ఏసుపాదం అనే విద్యార్థికి పి.యు.సి. కెమిస్ట్రీ పాఠాలు చెప్పారు రత్నం. ఆ తరువాత రోజుల్లో మరికొంతమంది సహోద్యోగులు మధుసూదన్‌రెడ్డి (జువాలజీ), రామకృష్ణారెడ్డి(బాటని), నరసారెడ్డి(ఫిజిక్స్)లతో కలిసి తమ ఇంట్లోనే వందలాది మందికి శిక్షణనిచ్చారు. 1983లో తన సొంతపేరు మీద 'రత్నం కోచింగ్ సెంటర్'ను ప్రారంభించి "కోచింగ్ సెంటర్" అనే పదంతో విద్యాసంస్థను స్థాపించడానికి రాష్ట్రంలోనే నాంది పలికిన తొలివ్యక్తిగా చరిత్రకెక్కారు రత్నం సారు.

1985లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. "రత్నం" విద్యాసంస్థలను అంచెలం చెలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే సంచలనాత్మక విద్యావేదికగా 'రత్నం'ను తీర్చిదిద్దడంలో తన ప్రతిభను చాటారు. ఇరువూరి కాలవలో రాతికట్టడం ప్రాంతంలో ఈతకొట్టిన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ... లోతు తెలియని ప్రాంతంలో మునిగిపోతున్న తనను కాపాడిన పోలుగాడిని తలుచుకుంటూ, ఆరోజు ఆ పోలుగాడు జుట్టుపట్టుకుని పైకిలాగి కాపాడిన ప్రాణమే ఈనాడు వేలాదిమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతోందని అప్పుడప్పుడు ఆ పోలుగాడిని గుర్తు చేసుకునేవారు. ఆర్థికంగా వెనుకబడిన ఎంతోమంది పేద విద్యార్థినీ విద్యార్థులకు తమ సంస్థలో చదువు కునేందుకు ఉచితంగా అవకాశాలు కల్పించేవారు రత్నం మాష్టారు. ఇంజనీరింగ్ లేదా మెడిసిన్‌లో దేశ స్థాయిలో ర్యాంకు సాధిస్తే వారికి డిగ్రీ చేతికి వచ్చే వరకూ అయ్యే ఖర్చును కూడా ఆయనే భరించేవారు. అలా ఆయన దాతృత్వంతో చదువుకున్నవారు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా డాక్టర్లుగా ఇంజనీర్లుగా తమ ప్రతిభను చూపిస్తున్నారు.

ఆధ్యాత్మికత్వంలోను, ఆపన్నులను ఆదుకోవడంలోనూ, ఆప్తులను, ఆత్మీయులను ఆదరించడంలోనూ రత్నం మాస్టారి సహధర్మచారిణి పద్మావతిరత్నం పతికి తగ్గ సతిగా అన్నివేళలా ఆయన వెంట నడిచేవారు.

### స్పందించే హృదయం!

భారతదేశంలో ఎక్కడ ఏ ప్రకృతి వైపరీత్యం సంభవించినా నెల్లూరుజిల్లా నుండి స్పందించే వాళ్ళలో ప్రథమ వరుసలో ఉండేవారు రత్నం. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి, వారికి ఆపన్నహస్తం అందించడానికి ముందుగా స్పందించే హృదయం ఆయనది. గత మూడున్నర దశాబ్దాలకు పైగా కోట్ల రూపాయల విరాళాలు ఎన్నో సంస్థలకు, ఎంతోమంది నిర్భాగ్యులకూ అందించి వారి ప్రేమను చూరగొన్నారు. చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ద్వారా వందలాదిమంది చిన్నారుల గుండెలను ఆగకుండా ఆడిరచి వారి తల్లిదండ్రుల హృదయాల్లో దైవమై నిలిచిన మానవతామూర్తి రత్నం మాష్టారు.

### మాటతప్పని మనస్తత్వం!

పట్టుదలకీ, కార్యదక్షతకీ, నీతికీ, నిజాయితీకీ, ఆడిన మాటకు కట్టుబడే తత్వానికీ వీటన్నిటికీ మూలమైన క్రమశిక్షణకీ నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే 'రత్నం' మాష్టారి జీవితం నేటి తరానికే కాక రేపటి తరానికి సైతం ఎంతో ఆదర్శవంతం. ఆధ్యాత్మికంగా, సేవాపరంగా, సాహితీపరంగా ఆయన అందిస్తున్న సేవలు చిరస్మరణీయం. 'శీలేన శోభతే విద్య' అనే నినాదంతో చలపనాయుడుపల్లి నుండి చికాగో నగరం దాకా విస్తరించి పరిమళిస్తున్న 'రత్నం' విద్యా కుసుమాలు జిల్లాకే గర్వకారణం.

### మొక్కవోని ధైర్యంతో మృత్యువుతో పోరాడారు!

నాలుగేళ్ళ క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి రెండవ వేవ్‌లో రత్నం మాస్టారుని కూడా వదల్లేదు. ఆ కరోనాకి చికిత్స జరుగుతున్న తరుణంలోనే అప్పటికే ఆయనను పట్టుకున్న క్యాన్సర్ మహమ్మారి గుట్టు బయటపడింది. తనకి క్యాన్సర్ అని తెలిసినా ఆయన ఎక్కడ అధైర్యపడలేదు. ఒక్కరోజు కూడా కంటతడి పెట్టలేదు. తనపై జాలి చూపించే అవకాశమే ఎవ్వరికీ ఇవ్వలేదు. మూడేళ్ళు ఆ మహమ్మారితో ఆత్మస్థైర్యంతో పోరాడారు. డాక్టర్లు సైతం ఆశ్చర్యపోయేలా ఎక్కడా అసహనం ప్రదర్శించ లేదు. కనీసం చివరి దశలో కూడా తాను అనుభవిస్తున్న నొప్పిని, బాధని పక్కవారికి తెలియనీయలేదు. తాను అమ్మా అంటే... తన సహధర్మచారిణి పద్మావతమ్మ అయ్యో అని ఎక్కడ బాధపడుతుందో అని తన నొప్పినంతా లోలోపలే దాచుకునేవారు. తన నీడకి కూడా నొప్పి తగలకుండా తనలోనే ఉంచుకునేవారు. కంటికి రెప్పలా, చంటి బిడ్డలా రత్నం మాస్టారుని పద్మావతమ్మ కాపాడుకున్నారు. రత్నం మాస్టారు వద్ద చదువు చెప్పించుకున్న డాక్టర్లే ఆయనని కళ్ళల్లో పెట్టి చూసుకున్నారు. "నేను ఇంక నీతో పోరాడలేను... నువ్వే గెలువు పో" అంటూ ఆయన మృత్యువుకి లొంగిపోయారు. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2.15 నిముషాలకి తన భార్య, బిడ్డలు, బంధువులు తనను అభిమానించి ఆరాధించే అనంతకోటి అభిమానుల్లో అతి కొద్దిమంది సమక్షంలో తుదిశ్వాస విడిచారు.



### తండ్రి బాటలో తనయులు!

ఆయన ఆశయాలకు, ఆయన ఆలోచనలకు, ఆయన ఆకాంక్షలకు ఊపిరిపోస్తూ 'రత్నం' స్కూల్స్ ద్వారా ఆయన కలలని పండిస్తున్నారు ఆయన ఇద్దరి కుమారులు వేణుగోపాల్, కిషోర్‌లు. కేవలం నెల్లూరుకే పరిమితం కాకుండా 'రత్నం' స్కూల్స్‌ను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేస్తూ... గ్రామీణప్రాంతంలోకి కార్పొరేట్ విద్యని విస్తరించడంలో తండ్రి సేవాగుణాలను పుణికిపుచ్చుకున్నారు ఈ బిడ్డలు. తిరుపతిలో సైతం 'రత్నం' స్కూల్స్‌ని నెలకొల్పి విశేష ప్రశంసలందుకోవడంలో తండ్రి కీర్తిప్రతిష్ట లను, ఆయన వేసిన పునాదులను మరింత పటిష్టం చేస్తున్నారు చిన్న కుమారుడు డాక్టర్ కిషోర్. ఓవైపు నెల్లూరులోని స్కూళ్ళను పర్యవేక్షిస్తూనే, మరోవైపు ఏలూరులో ఇంజనీరింగ్ కళాశాలను కూడా ప్రారంభించారు పెద్దకుమారుడు వేణుగోపాల్.

రత్నం మాస్టారు మనుమడు రోహిత్, మనుమరాలు రోషిణి కూడా తాత చూపిం చిన మార్గంలోనే నడుస్తున్నారు. విద్యారంగంలోనే తమ భవిష్యత్తును కొనసాగించ డానికి సంసిద్ధులయ్యారు.

### 'లాయర్'తో అపురూప అనుబంధం



విద్యా రంగంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించి దివికేగిన "విద్యాశిఖరం" రత్నం మాస్టారు. ఆ ఆత్మీయమూర్తితో 'లాయర్' కుటుంబానికి సైతం నాలుగు దశాబ్దాల అపురూప అనుబంధం ఉంది. ఎన్నో సందర్భాలలో 'లాయర్'ని వెన్నుతట్టి ప్రోత్సహించి ముందుకి నడిపించిన అనురాగమూర్తి రత్నం సారు. ఆయన 'లాయర్' కుటుంబంలో భాగమవడమే కాకుండా, 'లాయర్' కుటుంబం కూడా తమ కుటుంబంలో భాగమయ్యేలా స్థానం కల్పించారు. మాస్టారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ కన్నీటి నివాళులర్పిస్తోంది 'లాయర్'.















# సుపరిపాలన అందిస్తున్న వైకాపా ప్రభుత్వం

## - నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి



రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు గతంలో ఏ పార్టీ చేయని విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు ట్రంకురోడ్డులో నగర వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్, జిల్లా వైకాపా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాలు తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం మొదలుపెట్టాయని, అయినా ప్రజలు వాటిని నమ్మడం లేదని అన్నారు. ప్రజలు చూపుతున్న ఆదరణతో మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని,గతంలో కంటే రెట్టింపు సంక్షేమ పాలన అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు తమ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు.

# జగన్ నాయకత్వంలోనే గ్రామాల అభివృద్ధి

## - రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయని నెల్లూరు రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నిత్యం గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తులు కావాలా...?? అనునిత్యం ప్రజల్లో, గ్రామాలలో వివాదాలు సృష్టించే అభివృద్ధి నిరోధకులు కావాలో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని ఆయన సూచించారు. ఇటీవల ఆయన రూరల్ నియోజకవర్గంలోని సౌత్‌మోపూరు గ్రామంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, స్థానిక వైకాపా నాయకులతో కలిసి మోపూరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయసాయిరెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆ గ్రామనివాసి అయిన సీనియర్ సిపిఐ నాయకులు పముజుల దశరథరామయ్య నివాసానికి చేరుకుని ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసమే.. ఉమ్మడిగా పోటీ

## - టీడీపీ నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



రానున్న ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసమే ఉమ్మడిగా పోటీ చేస్తున్నామని, బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలని టీడీపీ నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈనెల 16న ఆయన సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి పట్టణంలోని రమణారెడ్డి కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని బాబు సూపర్-6 కరపత్రాలను ఇంటింటికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రి కాకాణి అరాచక పాలనను సర్వేపల్లిలో కొనసాగించారన్నారు. కాకాణి పుణ్యమా అంటూ కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ చెన్నైకి తరలిపోయిందని విమర్శించారు. వైకాపా పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాకాణికి, వైకాపాకి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించండి

## • మంత్రి పెద్దిరెడ్డి పిలుపు



వెంకటగిరి ప్రజలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటారని, రానున్న ఎన్నికల్లో రామ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వైకాపా రీజనల్ కో-ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి బంగ్లాలో ఈనెల 18న వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్నది వైకాపా ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని, అందువల్ల ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అడిగే ధైర్యం మనకు ముఖ్యమంత్రి జగన్ కల్పించారని అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ కలసికట్టుగా పనిచేసి రామ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి రాజా సంస్థానాధీశులు సాయికృష్ణ యాచేంద్ర, తిరుపతి ఎంపీ గురుమూర్తి, నాయకులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు నమోదు చేసుకోండి

18 సంవత్సరాలు నిండినవారు ఇంకా ఓటు నమోదు చేసుకోకుంటే దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం అవకాశం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. ఈనెల18న కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో రాజకీయనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, తహశీల్దార్ విజయశ్రీతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యలక్ష్మి కి ఘనస్వాగతం



వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి సమీపంలో ఉన్న 'సుబ్రహ్మణ్యం' గ్రామాన్ని మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఈనెల 16న సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను ఘనంగా స్వాగతించారు. ఆ గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాన్ని దర్శించి పూజలు చేసుకున్న అనంతరం ఆమె గ్రామస్తులను ఆత్మీయంగా పలకరించారు. ఆ గ్రామనివాసి సర్వేపల్లి సురేష్, లోకనాయుడుల నివాసాలకు వెళ్లి, వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి అలిమిలి కొండకు వెళ్ళి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆమె వెంట వెందోడు మధుసూదన్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, బాబురెడ్డి, దేవిక చౌదరి, జయకర్, స్వామయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో వ్యాపారానుకూల వాతావరణం అద్భుతం

## ○ బెల్జియం రాయబారి కితాబు




శ్రీసిటీలో వ్యాపారానుకూల వాతావరణం అద్భుతమంటూ భారత్‌లోని బెల్జియం రాయబారి డిడియర్ వాండర్ హాసెల్ట్ కితాబిచ్చారు. బుధవారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయన్ను ఘనంగా స్వాగతించారు. బెల్జియం రాయబారి మాట్లాడుతూ, చిన్న-మధ్య తరగతి వ్యాపారాలకు సైతం శ్రీసిటీ అనువుగా ఉంటుందన్నారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే మరిన్ని బెల్జియన్ కంపెనీలకు తాను శ్రీసిటీని పరిచయం చేస్తానని చెప్పారు. అందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, గణనీయమైన సంఖ్యలో బెల్జియం సంస్థలు ఆసక్తి చూపితే, ప్రత్యేక బెల్జియం పారిశ్రామిక క్లస్టర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బెల్జియంకు చెందిన వెర్మీరెన్‌తో సహా 29 దేశాల నుండి 220కి పైగా ప్రముఖ కంపెనీలకు నిలయంగా, భారతదేశంలో ప్రముఖ తయారీ కేంద్రంగా శ్రీసిటీ స్థానం దక్కించుకుందని పేర్కొన్నారు. తొలుత ఆయనకు శ్రీసిటీ ప్రత్యేకతలను, వేగవంతమైన పారిశ్రామిక ప్రగతిని వివరించారు. శ్రీసిటీ ప్రగతి, మౌలిక సదుపాయాలు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన వాండర్‌హాసెల్ట్, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. బెల్జియన్‌కు చెందిన వైద్య పరికరాల తయారీ పరిశ్రమ వెర్మీరెన్ ఇండియా రిహాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వాండర్‌హాసెల్ట్ సందర్శించారు. వెర్మీరెన్ గ్రూప్ చైర్మన్ మరియు సీఈఓ పాట్రిక్ వెర్మీరెన్, మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ రియాజ్ ఖాద్రీ ఆయనకు స్వాగతం పలికి, కంపెనీ ఉత్పత్తులు, వృద్ధి గురించి వివరించారు. అనంతరం, వెర్మీరెన్ ప్లాంట్ నాల్గవ దశ విస్తరణకు అంబాసిడర్ వాండర్‌హాసెల్ట్ శంకుస్థాపన చేశారు.



# 'గేట్'లో అర్హత సాధించిన.. ఎన్‌బికెఆర్ విద్యార్థులు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్బికెఆర్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు కురవ అశోక్ కుమార్, షేక్ అర్షద్‌లు జాతీయస్థాయిలో ఇటీవల నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) 2024 పరీక్షల్లో 484 మరియు 6425 ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఇది సాధ్యమైందని, గేట్ పరీక్షకు సంసిద్ధులయ్యే వారికి ఎన్‌బికెఆర్‌లో ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని విభాగాధిపతి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 'గేట్' ట్రైనింగ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు

## దివ్యాంగులకు
# కూరగాయల పంపిణీ



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఒగ్గు భాస్కర్ దాతృత్వంతో 20మంది దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెలా 3వ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణి చేస్తున్నామని, నేటి ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన ఒగ్గు భాస్కర్‌కి జేవీవీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. చెంచు నారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, అశోక్, విష్ణు, జగదీష్, మధు, సుబ్రహ్మణ్యం, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## విపిఆర్ ఆధ్వర్యంలో
# తెదేపాలోకి వైసీపీ నాయకులు



ఈ నెల 20వ తేదీ నెల్లూరులోని విపిఆర్ నివాసంలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ – జనసేన – బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సమక్షంలో చెన్నూరుకు చెందిన పలువురు ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన అల్లూరు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ముప్పాల సుధాకరరెడ్డి, గిరిధర్‌రెడ్డి, మదనపర్తి జనార్ధన్‌రెడ్డి, కందలి దశరథరామిరెడ్డి, మురళీరెడ్డి, శేషిరెడ్డిలు విపిఆర్‌ను ఘనంగా సన్మానించారు.

# తరతరాలకు స్ఫూర్తి.. వంగల్లు కోదండరామిరెడ్డి కీర్తి

శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే ఇతరులు అనుసరింతురు. అతడు నిల్పిన ప్రమాణములనే లోకులందరును పాటించెదరు... అని భగవద్గీత తెలుపుతున్నది. అదేవిధంగా శ్రేష్ఠులైన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని పురాణాలు చెప్తున్నాయి. అయితే, అందరు మహాపురుషులు చరిత్రకెక్కరు. కొందరు ఏ కారణం చేతో 'విస్మృత'మవుతారు.


అలాంటి మహాపురుషుడు, మీదుమిక్కిలి మన నెల్లూరీయుడు వంగల్లు కోదండరామిరెడ్డి గారి గురించి తెలిసినవారు చాలా తక్కువ. ఆయన ఆదర్శజీవితం అందరికీ తెలియజేసి, స్ఫూర్తిని ఇవ్వాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తలచారు. ఇప్పటికే 14మంది ప్రముఖుల జీవితచరిత్రలను రాసి ప్రచురించి వున్న బహుగ్రంథకర్త డా. రేవూరు అనంత పద్మనాభరావు (విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ)ను 'వంగల్లు' వారి జీవిత చరిత్రను గ్రంథస్థం చేయమన్నారు. పండిత శిరోమణి అయిన ఆయన అందుకు సరేనన్నారు. వంగల్లు కోదండరామిరెడ్డి గారి కుమార్తె సుభాషిణి, మనుమరాలు సుమితలు అనంత పద్మనాభరావుని కలిసి, తాము సేకరించివున్న పత్రాలను అందజేశారు. డా. రేవూరు అనంతపద్మనాభరావు నెల్లూరీయుడు కావడం యాధృచ్ఛికమే!

కోదండరామిరెడ్డితో పాటు, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సమకాలికులు పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర గవర్నర్లు, ఆంధ్రప్రదేశ్ మంత్రులుగా ప్రసిద్ధికెక్కారు. అయితే, వంగల్లు వారికి లభించిన అతిపెద్ద పదవి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూమి తనఖా బ్యాంక్ అధ్యక్ష పదవి మాత్రమే. దీనిని ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు. 'వంగల్లు' వారు దామోదరం సంజీవయ్యకు సన్నిహితుడు. పిడతల రంగారెడ్డికి ప్రేమపాత్రుడు.

కోదండరామిరెడ్డి వారి జన్మస్థలం బుచ్చి అయినా, తండ్రి రంగారెడ్డి అకాలమరణంతో ఆయన మేనమామ వద్దకు తోటపల్లిగూడూరు చేరారు. అక్కడే ప్రాథమిక విద్య, నెల్లూరు వి.ఆర్.సిలో ఉన్నత విద్య పూర్తయింది. కోదండరామ్ దృష్టి సేవాదృక్పథం మీద వుందని మేనమామ గుర్తించి ప్రోత్సహించారు. కోదండరామ్ తర్వాత కాలంలో నెల్లూరుజిల్లా రాజకీయ ప్రముఖులతో మంచి స్నేహసంబంధాలు ఏర్పరచుకున్నాడు. 1929 మార్చి 30న కోదండరామ్ పెళ్లి జరిగింది. కాంతమ్మ ఆయన సహధర్మచారిణి.

నెల్లూరు తాలూకా బోర్డు ఎన్నికల్లో వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. కొద్ది సంవత్సరాల్లో తాలూకా బోర్డు అధ్యక్షుడయ్యారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె ఆయన సంతానం.

1930 ఏప్రిల్ 11న మైపాడు ఉప్పు ఉద్యమంలో వంగల్లు పాల్గొన్నారు. మే నెల్లో గోగులపల్లి ఉప్పుసత్యాగ్రహంలో తొలి వరుసలో నిలిచాడు. మూడునెలల జైలు శిక్ష, 200 రూపాయల జరిమానా విధించారు. 1942 అక్టోబరు 15న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆరు నెలల కఠిన కారాగారశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్య సమరయోధులందరికీ సన్మానం జరిగింది. ఆ సన్మానాన్ని కోదండరామిరెడ్డి అందుకున్నారు. ప్రభుత్వ భూమిని, పెన్షన్‌ను వినమ్రంగా తిరస్కరించారు. అదీ ఆయన దేశభక్తికి, నిస్వార్థ ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనం. సహజంగా నాయకులు ఆస్తులు కొంటారు కానీ వంగల్లు వారు తన 20 ఎకరాలు అమ్మి తన జీవనాన్ని సాగించారు.




విస్మృత ప్రజానాయకుడు
**వంగల్లు కోదండరామిరెడ్డి**
రచయిత:
డా. రేవూరు అనంతపద్మనాభరావు
పేజీలు: 118 వెల: అమూల్యం
ప్రతులకు:
డా. రేవూరు అనంతపద్మనాభరావు
హైదరాబాదు.

ఆ విధంగా అంచెలంచెలుగా వంగల్లువారు నిస్వార్ధబుద్ధితో ఎదిగారు. రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, ప్రొవిజనల్ పార్లమెంట్ సభ్యుడిగా, శాసనసభ్యుడిగా, నెల్లూరుజిల్లా భూమి తనఖా బ్యాంక్ అధ్యక్షుడిగా, ఆం.ప్ర. భూమి తనఖా బ్యాంక్ అధ్యక్షుడిగా సేవలందించారు. కనుపూరు కాల్వ సాధించిన భగీరథుడు. అందరిచేతా పెద్దాయనగా పిలవబడ్డారు. ఆయన పేరు మీద తోటపల్లిగూడూరుకు సమీపంలో 'కోదండరామపురం' గ్రామం ఉండటం, ఆయన చరితార్థుడు అనే దానికి పెద్ద ఆధారం. ఉమ్మడి మదరాసు రాష్ట్రం నుండి రాజ్యాంగ పరిషత్‌కు ఎంపికయిన 56 మంది సభ్యుల్లో 'వంగల్లు' వారు ఒకరు. అంబేద్కర్ సారధ్యంలో మన నెల్లూరీయుడు ఆ పరిషత్‌లో పనిచేయడం నెల్లూరీయులందరికీ గర్వకారణం.

1962 శాసనసభ ఎన్నికల్లో అతి స్వల్ప ఓట్ల తేడాతో కోదండరామ్ ఓడిపోవడం ఆయన్ను బాధించింది. 65వ ఏటనే ఆయన మరణించడం జాతికి తీరని లోటు.

గ్రంథరచయిత 'రేవూరు' ఆయన జీవితంలోని ప్రతి విశేషాన్ని సరళంగా, సంక్షిప్తంగా తెలియజేశారు. అవసరమైన సందర్భాల్లో ఫోటోలను, ఆయనకు ప్రముఖులు రాసిన ఉత్తరాలను పొందుపరిచారు. ఒకపక్క 'వంగల్లు' వారి జీవితవిశేషాలను, సేవలను తెలుపుతూనే స్వాతంత్ర్యోద్యమ కాల చరిత్రను విపులంగా తెలియజేశారు. ఇందుకు ఆయనకు ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే! ఒక నిస్వార్ధ సేవకుని సేవా తత్పరతను వివరిస్తూ వ్రాసిన ఈ గ్రంథం అవశ్యపఠనీయం. స్ఫూర్తిదాయకం.



**డా. గంగిశెట్టి శివకుమార్**
నెల్లూరు. సెల్: 9441895343.

# సేవాతత్పరుడు మగ్దూమ్



మగ్దూమ్ సేవాతత్పరుడని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. ఈ నెల 20వ తేదీ గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో మహమ్మద్ ఫకృద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 786 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేరిగ మురళీధర్ మాట్లాడుతూ 15ఏళ్ళుగా మగ్దూమ్ మొహిద్దీన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు రోటరీ వెస్ట్ సన్మానం




భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకున్న ప్రముఖ డోలు వాయిద్య కళాకారుడు వినుకొండ సుబ్రహ్మణ్యంని గూడూరులోని కమ్యూనిటీ హాల్లో ఇటీవల రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సీనియర్ రొటేరియన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మన గూడూరు వాసి ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు తీసుకోవడం చాలా అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షులు సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం ఆల్ ఇండియా రేడియోలో, దూరదర్శన్లోనే కాకుండా తితిదే నిర్వహించే నాదనీరాజనంలో పాల్గొన్నారని, వీరు అనేక రాష్ట్రాల్లో కచేరీలు కూడా చేశారని, వీరు ఈరోజు మన క్లబ్‌కి రావటం సంతోషకరన్నారు. ఈ కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, వాసుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కృత్రిమ చేతులు

రోటి క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మే నెల 19 నుండి 26 వరకు చేయి లేని దివ్యాంగులకు ఉచితంగా చేతిని అమర్చే కార్యక్రమం జరుగుతుందని, గూడూరు మరియు పరిసర ప్రాంత దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 7207403150 నెంబర్‌కి ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని మయూరి శ్యాం యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే..

# జనసేనతో పొత్తు

### టీడీపీ నేత నారాయణ



రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే జనసేనతో టీడీపీ, బీజేపీ కలిసి ఎన్నికల్లో ముందుకెళ్లేందుకు పొత్తు పెట్టుకున్నామని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఇటీవల నెల్లూరులోని జనసేన కార్యాలయానికి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు సిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణలను ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో జనసేన పార్టీ బలంగా ఉందన్నారు. గత రెండేళ్ల నుంచి నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్‌లో 'జనం కోసం జనసేన' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రతి గడపకు వెళ్లి వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అడవుల సంరక్షణ ఎంతో ముఖ్యం

### --- కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు ---



మానవ మనుగడకు ప్రకృతి, పర్యావరణం, అడవులు ఎంతో ముఖ్యమని, ప్రత్యేకించి అడవుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదాని కృష్ణపట్నం పోర్టు సిఓఓ రాజన్‌బాబు చెప్పారు. అంతర్జాతీయ అడవుల దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఆదాని ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టులో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. కృష్ణపట్నం పోర్టు గ్రీన్ పోర్టుగా రూపుదిద్దికోనేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఉద్యోగి, కార్మికుడు, ఒక మొక్కను తప్పనిసరిగా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అదాని కృష్ణపట్నం పోర్ట్‌లో పర్యావరణ పరిరక్షణతో పాటు భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. చెట్లను నరికి వేయడం వలన పర్యావరణంతో పాటు వాతావరణంలో మార్పులు కలగడంతో మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అందుకోసం అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోర్టులో ఇప్పటికే 16 వేల మొక్కలు నాటినట్టు తెలిపారు. ఈ ఒక్కరోజులోనే 4 వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. అంతర్జాతీయ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబాదేవి హుండీ ఆదాయం..రూ. 16.81 లక్షలు



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు ఆలయంలో ఈనెల 20న హుండీలు లెక్కించారు. గత నవంబరు నుంచి ఈనెల 18వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 16,81,545 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఉషశ్రీ తెలిపారు. ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకరబాబు, జిల్లా దేవాదాయశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

# అందరికీ అండగా ఉంటాం.. ఆశీర్వదించండి

### - నార్తురాజుపాలెం సమావేశంలో వేమిరెడ్డి దంపతులు -



తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గం నార్తురాజుపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం కోలాహలంగా జరిగింది. పెద్దసంఖ్యలో వచ్చిన నాయకులు, కార్యకర్తలతో పీఎస్ఆర్ కల్యాణ మండపం సందడిగా మారింది. కోవూరు టీడీపీ నాయకుడు.. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం కోవూరు నియోజకవర్గ ప్రచారానికి సంబంధించిన పార్టీ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తాము అందుబాటులో ఉంటామన్నారు. కోవూరు టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మీ ముందుకు వస్తున్నామని, మీ కుటుంబ సభ్యులుగా భావించి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అవినీతి రహిత, వివాద రహిత కోవూరు నియోజకవర్గాన్ని నిర్మించుకుందామని స్పష్టం చేశారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, దినేష్‌రెడ్డికి మీరు ఏ విధంగా సహకారం అందించాలని అనుకున్నారో.. అదే సహకారం తమకు అందించాలని కోరారు. ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని, ప్రతి ఒక్కరికీ తాము అండగా ఉంటామని చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో తాను రాజ్యసభ సభ్యుడిగా ఎంపీ నిధులు దాదాపు 3 కోట్ల 26 లక్షలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. జొన్నవాడ ఆలయంలో చేసిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ఈ ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డిని, ఎంపీగా తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### కండలేరును సందర్శించిన

## ట్రైనీ కలెక్టర్



తెలుగుగంగలో అంతర్భాగమైన కండలేరు జలాశయాన్ని ట్రైనీ కలెక్టర్ సంజనాసింహ్ ఈనెల 20న సందర్శించారు. జలాశయం ఆనకట్ట పటిష్టత, నీటిమట్టం వగైరాలను పరిశీలించారు. కొత్తగా అక్కడ కడుతున్న సబ్‌డివిజన్ కార్యాలయ భవన సముదాయాలను, కట్టడాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె వెంట తెలుగుగంగ పర్యవేక్షక ఇంజనీర్ మిరియాల వెంకటరమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయకుమార్ రెడ్డి తదితరులున్నారు.

### పేదవిద్యార్థిని

## చదువుకు సాయం



నెల్లూరు విఆర్‌కాలేజీలో బీఇడి చదివి ఉత్తమశ్రేణి మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థిని ఆర్.అన్నపూర్ణకు ఆ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బి.భవానీశంకర్ తనవంతు సాయంగా 5వేల రూపాయలు అందజేశారు. బి.సావిత్రి స్మారక నగదు బహుమతిగా, ఆ డబ్బును తనకు వచ్చే పింఛను నుంచి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మద్యం గోడౌన్ తనిఖీ



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మద్యం గోడౌన్, తయారీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తనిఖీ చేశారు. బుధవారం నెల్లూరు రూరల్ మండల పరిధిలోని దేవరపాలెం వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్యం గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ తరలింపు, నిల్వ చేయడంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం కలెక్టర్ సర్వేపల్లిలోని ఎస్ఎన్‌జె డిస్టిలరీ మద్యం తయారీ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు.

# లోక్‌అదాలత్‌లో.. నెల్లూరు జిల్లా ఫస్ట్



రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి నెల్లూరుజిల్లా ప్రథమ స్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని కృషితో జిల్లావ్యాప్తంగా అన్నికోర్టుల్లోనూ ఎక్కువ కేసులను లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకోవడం విశేషం. దీంతో కక్షిదారుల్లో సంతోషం వ్యక్తమైంది. ఈనెల 16న నెల్లూరులోని జిల్లాకోర్టు ఆవరణలో ఉన్న లోక్‌అదాలత్‌భవన్‌లో జిల్లాన్యాయమూర్తి యామిని లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గం ద్వారా కేసులను రాజీచేసుకుంటే ఇరుపక్షాలకు శ్రేయస్కరమని చెప్పారు. అనంతరం, ఉమ్మడి నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 1959 కేసులను పరిష్కరించారు. బాధితులకు పరిహారం చెక్కులు అందజేశారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి, పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని లోక్‌అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించారు.

# 'రుక్మిణీ కల్యాణ ఘట్టం'..ఎంతో విశిష్టమైనది

## ప్రముఖ అవధాని కోట రాజశేఖర్



మహాకవి పోతన వ్యాస భాగవతాన్ని తెలుగులోకి అనువదించి తెలుగు సాహిత్యానికి ఘనమైన సేవ చేశాడనీ, పోతన భాగవతంలో 'రుక్మిణీ కళ్యాణం' ఘట్టం ఎంతో విశిష్టమైనదని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. నెల్లూరులో ఇటీవల చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్ రీడింగ్‌రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన 'రుక్మిణీ కల్యాణం–పోతన భాగవతం' అనే అంశంపై వివరంగా ప్రసంగించారు.

సభకు పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. అనంతరం, కోట రాజశేఖర్‌ను చేతన కార్యదర్శి వై. శేషగిరీశం, మురళీకృష్ణ హోటల్ వీరిశెట్టి హజరత్ బాబు, ఏపీ జెన్‌కో డీఎస్పీ శ్రీనివాస రావు ఘనంగా సత్కరించారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై. విశ్వనాధం, అడ్వొకేట్ గూడూరు లక్ష్మి, నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రా దేవి, గట్టుపల్లి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

# రూ. లక్ష దాటిన నగదు లావాదేవీలపై.. నివేదిక ఇవ్వాలి

## - బ్యాంక్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లక్ష రూపాయలు దాటిన నగదు లావాదేవీలపై బ్యాంక్ అధికారులు నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బ్యాంకు అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటినుండి తరచుగా



వారి ఖాతాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులకు కొత్త బ్యాంక్ ఖాతాలను ప్రారంభించాలని చెప్పారు అలాగే 10 లక్షల రూపాయలపై బ్యాంకుల్లో జరిగిన లావాదేవీలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు ఇవ్వాలన్నారు. ఒకే ఖాతా నుండి పలుసార్లు నగదు లావాదేవీలు జరిగిన ఖాతాలను పరిశీలించాలని, బ్యాంకుల నుండి ఏటిఎంకు పంపే నగదు వాహనాలకు క్యూఆర్ కోడ్ ఇవ్వాలని సూచించారు. అనుమానస్పద లావాదేవిలపై బ్యాంకు అధికారులు ప్రతిరోజు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్, ఎన్నికల ఖర్చుకు సంబంధించిన మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగులకు ఉచిత వైద్యం




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎం.ఎస్.ఆర్. స్పాస్టిక్స్ సెంటర్‌లో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, 65 మంది మానసిక వికలాంగులైన పిల్లలను పరిశీలించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు వై.శ్రీనివాసరావు మరియు వారి బృందం, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాసరి రాజేంద్రప్రసాద్, మస్తానయ్య, ఎన్.బలరామయ్యనాయుడు, ప్రిన్సిపాల్ పి.గురునాథరావు పాల్గొన్నారు. అనంతరం, రెడ్ క్రాస్ సిబ్బంది డా. వై.శ్రీనివాసరావును సత్కరించారు.

# కనీసం మద్దతు ధరతో.. జొన్న, మొక్కజొన్న సేకరణ

- **రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం**

ఈనెల 19 నుంచి జిల్లా వ్యాప్తంగా జొన్న, మొక్కజొన్న సేకరణకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు మేరకు జొన్న పంట ఒక క్వింటాలుకు రూ.3180, మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ.2090 కనీస మద్దతు ధరగా ప్రకటించినట్లు తెలిపారు. జొన్న, మొక్కజొన్న సాగుచేసిన రైతులందరూ ఏప్రిల్ 5వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.



# జానకిరామ.. రామాయణం 5

- ఊటుకూరు జానకి రామారావు

దేవతలంతా వానర స్త్రీల యందు మహాబలశాలురయిన పుత్రులుగా జన్మించారు!

అంతకుఎన్నో ఏళ్ళ పూర్వమే జాంబవంతుడు బ్రహ్మదేవుడి ఆవులింతనుండి జన్మించాడు.

ఋషులు, సిద్ధులు, విద్యాధరులు, ఉరగులు, చారణులు దివ్యశక్తులు కలవారంతా తమతమ కుమారులుగా వీరాధివీరులైన వానరులను సృజించారు.

దేవేంద్రుడు వాలిని,
సూర్యుడు సుగ్రీవుని,
దేవగురువు బృహస్పతి తారుడు అనే బుద్ధిశాలి అయిన వానరుడిని,
కుబేరుడు గంధమాధనుని
విశ్వకర్మ నలుడిని
అగ్ని నీలుడిని
అశ్వనీ దేవతలు మైంద, ద్వివిదులను
వరుణుడు సుషేణుడిని
పర్జన్యుడు శరభుని

వాయుదేవుడు శ్రీమంతుడు, వీర్యవంతుడు, వజ్రమయ దేహము గలవాడు, గరుత్మంతునితో సమానవేగము గలవాడు, శత్రుభయంకరుడు అయిన హనుమంతుని సృజించాడు.

ఏ దేవుడికి ఏ రూపము, ఏ వేషము, ఏ పరాక్రమము, ఏ తేజస్సు ఉండెనో ముమ్మూర్తులా అవే లక్షణాలతో అనేక కోట్ల వానరులు జన్మించారు!.

ఈ వానరులంతా కూడా అమిత బల సంపన్నులు!

యుద్ధంలో పెద్దపెద్ద కొండల వంటి రాళ్ళు శత్రువుల మీద విసిరి వేయగలరు, మహావృక్షాలు వేళ్ళతో సహా పెకిలించి వైరివీరులను చావచితక కొట్టగలరు!

సముద్రాలను కలియబెట్టగలరు, భూమిని నిట్టనిలువుగా చీల్చి వేయనూగలరు!

అరణ్యాలలో స్వేచ్ఛగా తిరిగే మదగజాలను(ఏనుగులు) పిల్లిపిల్లల్లా చంకన వేసుకొని తిరుగగలరు!

వారి సింహనాదాలకు ముల్లోకాలు కూడా కంపించిపోతాయి!

ఇలాంటి లక్షణాలున్న వానరవీరులంతా రామసహాయార్థము భూమినిండా జన్మించి ఉన్నారు!.

అక్కడ అయోధ్యలో రాముడు శుక్లపక్ష చంద్రునివలే దినదిన ప్రవర్ధమానమవుతున్నాడు! ఆయన చేసే అల్లరికి అంతేలేకుండా ఉన్నది! ఆయన ఏమిచేసినా ఆ తండ్రికి మురిపెమే!

రారా నా రామా! అని గుండెలమీద కొడుకుని పరుండపెట్టి అంత పెద్ద మహారాజు తాను కూడా చిన్నపిల్లవాడై వయసుమరచి, రాజునని మరచి కొడుకుతో ఆటలు, పాటలు.

రాముని విడిచి ఒక్క క్షణం ఉండలేని మరో ప్రాణి కూడా ఉంది అయోధ్యలో! ఎవరో కాదు లక్ష్మణస్వామి ఆయన!

రాముడి నీడ ఎలా ఉంటుంది? అని అడిగితే ఇదిగో ఇలా ఉంటుంది అని లక్ష్మణుడి వైపు వేలెత్తి చూపటం అలవాటు చేసుకున్నారు అయోధ్యానగరవాసులు!

ఇక అన్నగారికి తమ్ముడంటే పంచప్రాణాలు. సౌమిత్రి ప్రక్కనలేనిదే ఈయనగారు ఏ పనీ చేయరు! అన్నం తినడు! ఆఖరుకు నిద్రపోవాలన్నా ప్రక్కన తమ్ముడు ఉండవలసినదే!

అదేవిధంగా మరొక జంట భరతశత్రుఘ్నులు.

ఇలా నలుగురు కుమారులు ఆయన ఆనందాన్ని పెంపొందిస్తూ ఉండగా కాలం ఎలా గడచిపోతున్నదో తెలియరావటం లేదు దశరథ మహారాజుకు!.

ఆ కుమారులు నలుగురూ కూడా ధనుర్విద్యలో అపారపాండిత్యం సంపాదించారు, వేదవేదాంగాలు వారికి కరతలామలకం!

తల్లిదండ్రులను,పెద్దలను సేవించటంలో వారి తరువాతనే ఎవరైనా, సకలసద్గుణాలతో శోభిల్లే వరాల మూటలు దశరథ తనయులు!.

కాలమిలా గడుస్తుండగా ఒకరోజు!

కుశిక వంశీయుడు, గాధి కుమారుడు అయిన విశ్వామిత్రుడు వచ్చినాడని మీ రాజుకు ఎరుక పరచండి! మహారాజ దర్శనం కోరుతూ వచ్చిన ఒక మునిపుంగవుడు పలికిన పలుకులివి.

ద్వారపాలకులు ఆ వచ్చిన వ్యక్తిని చూచి భయముతో వణకిపోయి దశరథసముఖమునకు శీఘ్రమే చేరి మహర్షివిశ్వామిత్రుని ఆగమనాన్ని ఆయనకు తెలిపినారు!.

అంతటి పరమపూజనీయుడయిన మహర్షి తన నగరుకు రావటాన్ని తన పుణ్యఫలంగా భావించి, దశరథుడు ఆయనకు ఎదురేగి అర్ఘ్య పాద్యాదులనిచ్చి, ఒక ఉచిత ఆసనం అలంకరింపచేసి అంజలి ఘటించి నిలుచున్నాడు.

మహారాజు వినయ విధేయతలకు సంతసించిన మహర్షి దశరథుడిని కుశలప్రశ్నలు వేసి అందరి క్షేమము విచారించినాడు!.

మహర్షి ఎదుట నిలుచున్న దశరథుడు ఆయన రాకలోని ఆంతర్యమేమిటో తెలియనివాడై, మహర్షిని ఏ పని మీద మీరు ఇచటికి వచ్చినారో సెలవిండు, మీ కార్యము ఎటువంటిదైనా తప్పక నెరవేర్చెదను, నా వద్దనున్న సమస్తము మీ పాదాక్రాంతము చేస్తున్నాను, మీ కేమికావాలో



తీసుకొనుడు అని సవినయంగా ప్రార్థించాడు.

అప్పుడు బ్రహ్మర్షి తాను వచ్చిన పని బయటపెట్టాడు !

మహర్షి కోరిక తెలుసుకొని ఒక్కసారిగా నవనాడులూ కృంగిపోయి, జవసత్వాలుడిగినవానిలాగా నీరసించాడు దశరథుడు! .

ఆ కోరిక ఏమై ఉంటుంది?

మహారాజును పంచప్రాణాలు అడిగినా సంతోషంగా అప్పటికప్పుడు ఇచ్చేవాడు, కానీ ఆయన అడిగింది! శ్రీరాముని తనతో పంపమని!

క్రూర, ఘోర రాక్షసులైన మారీచ, సుబాహుల నుండి మహర్షి చేసే యాగాన్ని రక్షించడం కోసం ముక్కుపచ్చలారని తన ముద్దుబిడ్డడిని పంపాలట!

మహర్షి కోరిక వినగానే ప్రాన్పడిపోయాడు దశరథుడు!

మహర్షి కోరిక ఆయన హృదయాన్ని నిలువునా కత్తితో చీల్చినట్లయినది, తన ముద్దులమూట, ముక్కుపచ్చలారని పసికూన, నిండా పదహారు నిండనివాడు, అరవిచ్చిన తామరల వంటి కన్నులుగల తన గారాలపట్టిని ఈ మహర్షి వెంట అడవులకు పంపడమా! మనసు ససేమిరా అంటున్నది!.

మహారాజు మదిలోని ఆలోచనలు పసిగట్టిన మహర్షి!

దశరథా!

రాముని గురించి నీకేమి తెలుసని అలా ఆలోచిస్తున్నావు!

**అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్**
**వసిష్టోపి మహాతేజా యే చేమే తపసి స్థితాః.**

రాముడెవరో నాకు తెలియును, నీ కుల గురువైన వశిష్టునకు తెలియును, ఈ ముని సంఘాలకూ తెలియును!

రామునికి తప్ప నా కార్యము చేయుటలో ఎవరికినీ సామర్థ్యము లేదు! రాముని ఎదుట మారీచ, సుబాహులు ఏ విధముగనూ నిలువజాలరు!

**న చ తౌ రామమాసాద్య శక్తౌ స్థాతుం కథం చన!.**

అని ఇంకా చెపుతున్నారు మహర్షి!..

..(సశేషం)

# బాబోయ్ రొచ్చు.. అదిరిపోయే ఖర్చు!

(మొదటి పేజీ తరువాయి)

వారాల్లోనే పూర్తయ్యేవి. 2019లో ఎన్నికలు 33 రోజుల్లో పూర్తయితే, ఇప్పుడు అటు లోక్‌సభ, ఇటు శాసనసభలకు జరిగే ఎన్నికల తంతు పూర్తవడానికి సుమారు 57 రోజులు పడుతుంది.

ఈ రోజుల్లో ఎన్నికలంటే, గతంలోలాగా ఆషామాషీ విషయం కాదు. కోట్లు కుమ్మరిస్తేనే ఓట్లు రాలుతాయి. కాబట్టి, కోట్లకు పడగలెత్తినవారికే ఇప్పుడు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాలు కూడా లభిస్తున్నాయి. ఎక్కడ చూసినా డబ్బు రాజకీయాలే. అందులోనూ వందల కోట్లు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుపెట్టకుంటే ఎన్నికల కురుక్షేత్రంలో నిలబడలేని పరిస్థితి.

## నోట్ల కొరతతో...
## తల పట్టుకుంటున్న నేతలు!

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ ఎన్నికలు మొదటి దశలోనే జరిగిపోతాయని, లేదంటే రెండోదశలోనైనా నిర్వహిస్తారని అందరూ ఆశపడ్డారు. చివరికి అవి నాలుగోదశకు చేరడంతో అభ్యర్థులు బేజారెత్తిపోతున్నారు.మన రాష్ట్రంలో 4వ విడతలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరిస్తారు. ఏప్రిల్ 25న నామినేషన్ ప్రక్రియ ముగుస్తుంది. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 చివరి తేదీగా ఎన్నికల సంఘం ప్రకటించింది. మే 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరుగుతుంది. ఈ ప్రక్రియలన్నీ జరగడానికి ఇప్పటినుండి సుమారు 45 రోజుల సమయం పడుతుంది. ఇలాంటి తరుణంలో ప్రచారానికి కావలసినంత సమయం ఉందిలే అని సంబరపడాల్సిన నేతలు అందుకు బదులుగా కలవరపడుతున్నారు. అన్నిరోజుల పాటు కాసులెలా చేయాలి, కేడర్‌ను ఎలా కాపాడుకోవాలిరా భగవంతుడా అని తలలు పట్టుకుంటున్నారు. నాలుగోదశ దాకా లాగాలంటే అప్పటి దాకా అయ్యే ఖర్చు తడిసి మోపెడవుతుందని నేతలు లబోదిబో మంటున్నారు. వాస్తవానికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్థుల ఖర్చుల విషయంలో వ్యయపరిమితి వుంది. ఆ పరిమితి వారికి ఒక్క గంటలో ఖర్చయిపోతుంది. ఒక్క మండల స్థాయి నాయకుడిని సంతలో పశువుని కొన్నట్లుగా కొనడానికి అయిపోతుంది.

## సందడి మొదలు

షెడ్యూలు రావడంతోనే సర్వత్రా ఎన్నికల సందడి మొద లయ్యింది. అభ్యర్థులు, పార్టీల నాయకులు డబ్బుసంచుల మూటలు విప్పడం మొదలుపెట్టారు. ఇప్పుడు వాళ్ళ దిగులంతా ఒక్కటే. ఆంధ్రాలో ఎన్నికలు మొదటి దశలో వుంటాయిలే అన్న ధీమాతో అందుకు తగ్గ అంచనాలు వేసుకుని కాసులు సిద్ధం చేసుకుని యుద్ధానికి సిద్ధం అంటూ సవాళ్లు విసిరారు.

కానీ, తమ అంచనాలు తారుమారయ్యాయి. ఇంకా ఒకటి న్నర నెల బండి లాగాలి. ఎండల్లో తిరగాలి. వాళ్లకి దండాలు దస్కాలు పెట్టాలి. వాళ్ళ గొంతెమ్మ కోరికలు తీర్చాలి. ఇవన్నీ, కాక ఓటుకి నోటు ఖచ్చితంగా పంచాలి. చివరి అంకానికి అందరూ తయారుగానే వున్నారు. ఎవరి సత్తా మేరకు వాళ్ళు నోట్ల మూటలు రెడీ చేసుకున్నారు. ఇప్పుడు వచ్చిన చిక్కంతా 45 రోజుల సినిమానే. 44వ రోజు వాళ్లకి ఇవ్వాల్సింది ఇచ్చినా ఈలోగా వాళ్ళను జారిపోకుండా కాపాడుకోవడమే పెద్ద ప్రహసనం. మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకుల డిమాండ్లు కూడా తారా స్థాయిలోనే ఉంటాయి. ఈ సవాళ్ళన్నిటినీ అధిగ మించుకుంటూ చివరిరోజుకి చేరాలి. జూన్ 4న వచ్చే ఫలితం ఎలా వున్నా మే13 పోలింగ్ ముగిశాక మాత్రం ఎన్నికల బరిలో వున్న నాయకులంతా ఎవరెస్టు శిఖరం చివరి అంచుదాకా ఎక్కినంత ఆనందపడిపోతారు. ఆ శిఖరాన్ని చేరుకున్నామా..? లేదా..?? అన్నది మాత్రం జూన్ 4నే వాళ్లకి తెలుస్తుంది. ఆంధ్రాలో ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తోంది. సమయం పెరగడంతో నేతలు నోట్ల వేటలోపడ్డారు. నల్లధనం కోసం శోధించడం ప్రారంభించారు. మీకు తెల్ల(అకౌంటబుల్) డబ్బులిస్తాం... మాకు నల్ల (అన్ అకౌంటబుల్) డబ్బు ఇస్తారా అంటూ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. "బాబోయ్ రొచ్చు – అదిరిపోయే ఖర్చు" అనుకుంటూ కాసుల కోసం కుస్తీ పడుతున్నారు.

ఎన్నికల వేసవిలో ఓటర్ల ధన దాహం తల్చుకుంటే నేతలకి చెమటలు పడుతున్నాయి. ఓట్లకంటే ముందు నోట్ల సంగతి చూసే పనిలో అన్ని పార్టీల నేతలు బిజీ అయిపోయారు.

# అది దుష్టకూటమి.. దానిని నమ్మకండి

**మంత్రి కాకాణి విమర్శ**



వైకాపాను ఎదుర్కొనేందుకు టీడీపీ–జనసేన–బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయని, అది దుష్ట కూటమి అని, దానిని నమ్మవద్దని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 20న ఆయన తోటపల్లిగూడూరు మండలంలోని వెంకన్నపాళెం పట్టపుపాళెంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2014లో కూడా మూడుపార్టీలు కలిసి అధికారంలోకి వచ్చినా, ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం గాలికి వదిలేశాయన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన నాయకులు మళ్ళీ ప్రజలను మోసం చేసేందుకు కూటమిగా ఏర్పడ్డారని దుయ్యబట్టారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం ఖాయమన్నారు.



**రాజ్యసభ సభ్యులు, నెల్లూరు పార్లమెంటు టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి, కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న కర్ణాటక టిడిపి కో–ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి**

# జిల్లావ్యాప్తంగా ఎన్నికలకు పటిష్టంగా ఏర్పాట్లు

ఎన్నికలకు షెడ్యూలు విడుదల కావడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలుగా ఉంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది ఇప్పటినుంచే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై దృష్టి సారించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈనెల 21న గురువారం నెల్లూరు నగర పరిధిలోని భక్తవత్సలనగర్‌లో కెవిఆర్ మున్సిపల్ హైస్కూల్, నవాబుపేట బివిఎస్ బాలికల హైస్కూల్, స్టోన్‌హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లందరూ ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే చేపడుతున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశంలో ఓటరు సహాయక కేంద్రాన్ని కూడా ఏర్పాటుచేసి ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికా రులను ఆదేశించారు. ఈ సహాయక కేంద్రం ద్వారా ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని, ఆ పోలింగ్ కేంద్రానికి సులువుగా వెళ్లి ఓటు వేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టిసారించారు. వేసవికాలం దృష్ట్యా తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి సౌకర్యాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో వికలాంగుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కూడా కృషిచేస్తున్నారు.

## ● జిల్లా యంత్రాంగం బిజీబిజీ

రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. ఈనెల 21వ తేదీ గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సి–విజిల్, 1950 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచిం చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త పడాలని, అన్ని బృం దాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఈవీఎంలు, పోల్ మేనేజ్‌మెంట్ పై శిక్షణ కార్యక్రమాలు మొదలు పెట్టాలన్నారు. ఆర్వోలు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

## ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

**– కలెక్టర్ హరినారాయణన్**

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ఎన్నికల ర్యాలీలు, సభలు, ప్రచారానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకునేలా

# నోటి పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**దంతవైద్యనిపుణురాలు డా.మానస**

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతిఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రముఖ దంతవైద్య నిపుణురాలు డాక్టర్ మానస చెప్పారు. మార్చి 20వ తేదీ ప్రపంచ నోటి పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, స్థానిక మానస డెంటల్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో డైకస్‌రోడ్డులోని వియానీహోంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. నోటిని పరిశుభ్రంగా ఉంచు కునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. రూడ్స్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, ఏఎస్ఐ మహబూబ్‌బాషా, వియానీహోం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాలతోనే అభివృద్ధి

## ● ఆర్ఎస్ఆర్ ఆత్మీయ సమావేశంలో ప్రజల స్పందన



నెల్లూరులోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మన్, రాష్ట్ర వైఎస్సార్సీపీ సేవాదళ్ కార్యదర్శి, 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఈనెల 20న ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రజల నుండి అపూర్వ స్పందన కనిపించింది. ఆదాలతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆదాలకు తమ మద్దతును తెలియజేశారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్‌ని అన్నివిధాలగా అభివృద్ధి చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డికి అఖండ విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

# మూలస్థానేశ్వరుని ఆదాయం..రూ. 6.20 లక్షలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 20న హుండీలు లెక్కించగా, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా దేవాలయానికి 6,20,377 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. గత డిసెంబరు 30 నుంచి ఈనెల 20వ తేది వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఎం.సుధీర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్, ధర్మకర్తలు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.



## ఎన్‌బికెఆర్‌లో...

# 'హ్యుండాయ్' ప్రాంగణ ఎంపికలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన దిగ్గజ కంపెనీ 'హ్యుండాయ్ మోటార్స్ ఇండియా ఇంజనీర్స్' వారిచే ఇటీవల ప్రాంగణ ఎంపికలు జరిగాయి. కంపెనీ ప్రతినిధులు శ్యామ్ కుమార్, అవినాష్, దినేష్‌లు పాల్గొని బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మెకానికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ముందుగా 74 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు జరిపారు. వీరిలో 34 మంది రౌండ్ టూల్ టెస్ట్‌కు ఎంపిక కాగా, 14 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్ టెస్ట్‌లు జరిపారు. అందులోకూడా ఎంపికైన విద్యార్థులకు తమ కంపెనీల్లో ఉద్యోగాలిచ్చి వార్షిక వేతనంగా ఏడాదికి రూ.5లక్షలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, దేశంలోని ప్రతి హ్యుండాయ్ కారును ముందుగా హైదరాబాద్‌లో డిజైన్ చేసి, ఆ తర్వాత చెన్నై ప్లాంట్‌లో రూపుదిద్దినవేనని చెప్పారు. ఇక్కడ సిఏటిఐవి శిక్షణ పొందిన విద్యార్థులను తమ కంపెనీకి ఎంపిక చేసుకోనున్నామని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డా. విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో, ఎన్‌బికెఆర్ ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషోర్ సారధ్యంలో ఈ ఎంపికల పరీక్షలు నిర్వహించారు.

# డీసీసీబీ సేవలపై ప్రజలకు అవగాహన



జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అందజేస్తున్న వివిధ రకాల సేవలపై ఈనెల 17న ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు, జీఎం సరిత, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు శ్రీధర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 23వరకు.. ఒంటిపూట బడులు

వేసవి వేడిమి పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈనెల 18 నుంచి ఒంటిపూట తరగతులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 23వ తేదీవరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

# మనుబోలమ్మకు బంగారు కవచాలు



మనుబోలు గ్రామ దేవత మనుబోలమ్మ అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన దాతలు చెన్నూరు కోదండరామిరెడ్డి - అనసూయ్య, చెన్నూరు సునీల్-అజిత దంపతులు సుమారు రెండు లక్షల రూపాయల విలువచేసే బంగారు కవచాలను అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం చేసి అమ్మవారి ఆ స్వర్ణ కవచాలను అలంకరించారు. అనంతరం దాతలను ఆశీర్వదించారు.

# ఎన్నికల కోడ్ వచ్చేసింది

## ○ ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు
## ○ మే 13న పోలింగ్ ○ జూన్ 4న కౌంటింగ్

***కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఈనెల 16.. శనివారం రోజున ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లయింది. దీంతో ప్రభుత్వ పాలన అంతా అధికారుల చేతిలోకి వెళ్ళింది. ఎన్నికల ప్రక్రియ పూర్తై, ప్రభుత్వం కొలువు తీరే వరకు అధికారులకే నిర్ణయాధికారం ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదలవుతుంది. ఆరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.***

ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ ఈనెల 16న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా జరగాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్‌తో దేశవ్యాప్తంగా 7 విడతల్లో పోలింగ్ ప్రక్రియ జరగనుండగా, మన రాష్ట్రంలో 4వ విడతలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఏప్రిల్ 25న నామినేషన్ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 చివరి తేదీ అని చెప్పారు. మే 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరుగుతుందని, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఏప్రిల్ 18న ఫామ్-1 విడుదల చేస్తూ ఏ ఏ ప్రాంతాల్లో నామినేషన్లు స్వీకరిస్తామో తెలియజేస్తామన్నారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి తాను రిటర్నింగ్ అధికారిగా ఉంటానన్నారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సబ్ కలెక్టర్, కావలి-ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆర్డీవోలు, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గానికి జాయింట్ కలెక్టర్, నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి మున్సిపల్ కమిషనర్, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డీవో-నెల్లూరు, సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ కలెక్టర్ తెలుగు గంగ, ఉదయగిరి నియోజకవర్గానికి ఆత్మకూరు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, వెంకటగిరి నియోజకవర్గానికి తిరుపతి సబ్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు సెలవు దినాల్లో మినహా అన్ని రోజుల్లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు.

### జిల్లాలో 20,39,215 మంది ఓటర్లు :

జిల్లాలో 20,39,215 మంది ఓటర్లున్నారు వారిలో పురుషులు 9,97,908 మంది కాగా, స్త్రీలు వారికన్నా అధికంగా మొత్తం 10,41,096 మంది ఉన్నారు. ఇతరులు 211 మంది ఉన్నారని, వీరందరి కోసం 2463 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసేంతవరకు కొత్త ఓట్లను నమోదు చేయనున్నామని తెలిపారు. విలేకర్లకు, మీడియా వారికి సమాచారం కోసం నెల్లూరు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం మిద్దెపై సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినటు ఆయన తెలిపారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని కోరారు.

# బ్రహ్మాండంగా.. ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

## • 22న గరుడసేవ, 23న రథోత్సవం





జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..పురాణకాలంలో నారద మహర్షిచే ప్రతిష్టితమై బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. ఈనెల 19 నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 25వ తేది వరకు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక ఆలయ నిర్వాహకులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని, పరిసరాలను విద్యుత్ శోభలతో దేదీప్యమానం చేశారు. 19న గిరిప్రదక్షిణ, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 20న తిరుమంజన సేవ, ధ్వజారోహణం, శేషవాహనోత్సవాలు, 21న హనుమంత సేవ కన్నులపండువగా జరిగాయి. 22 శుక్రవారం నాడు ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రికి నేత్రపర్వంగా గరుడసేవ జరుగుతాయి. అదేవిధంగా, 23న ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి గజ వాహనసేవ నిర్వహిస్తారు. 24న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం అంగరంగ వైభవంగా రథోత్సవం, రాత్రికి అశ్వవాహనసేవ జరుగుతాయి. 25న పుష్పయాగం, రాత్రికి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## టూకీగా...



### అల్లూరులో ఇళ్ళ పత్రాలు పంపిణీ

మండల కేంద్రమైన అల్లూరులో సచివాలయం-1 పరిధిలోని లబ్దిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఇటీవల అందజేశారు. గతంలో జగనన్న ఇళ్ల పట్టాలు తీసుకున్నవారికి ఆ పత్రాలను పంపిణీ చేశారు. వైకాపా నాయకుడు నీలం సాయికుమార్, సచివాలయం సెక్రటరీ వరప్రసాద్, నాయకులు ఉస్మాన్ షరీఫ్, బత్తల సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

### రాపూరులో 'పోషణ్ పక్వాడా'

రాపూరులోని ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో దళితవాడల్లో ఉన్న గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లితండ్రులకు ఐసీడీఎస్ సీడీపీఓ సునంద ఆదేశాలతో సూపర్‌వైజర్ శారదా దేవి ఆధ్వర్యంలో పోషకాహారం పట్ల అవగాహన కలిగించారు. పోషక విలువలు కలిగిన ఆహారపదార్ధాలను ప్రదర్శించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాటిపర్తిలో.. పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు మండలం తాటిపర్తిలో వెలసివున్న రుక్మిణీ సమేత శ్రీ పాండురంగస్వామి దేవాలయంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా 22న గరుడసేవ, గ్రామోత్సవం, 23న కల్యాణోత్సవం, 24న పాండురంగస్వామి అగ్నిగుండ ప్రవేశం, 25న వసంతోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

### బిట్రగుంట పాఠశాలల్లో మజ్జిగ చలివేంద్రాలు

బోగోలు మండలం పాత బిట్రగుంట, కొత్త బిట్రగుంట, కడనూతల ప్రాథమిక పాఠశాలల్లో బెంగుళూరుకు చెం దిన పారిశ్రామికవేత్త సంజయ్ రవికొండ వితరణతో, ఎంవి ప్రసాద రావు ఆధ్వర్యంలో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటుచేయగా, ఇటీవల ఎంఇఓలు పి.నరసింహారావు, ఎం.జయమ్మ వాటిని ప్రారంభించారు.

### కోవూరులో హాస్టల్ విద్యార్థులకు విద్యాసామాగ్రి

కోవూరులోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని 75 మంది విద్యార్థులకు పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ వారు ఈనెల 17న విద్యాసామాగ్రిని, వితరణగా అందజేశారు. పచ్చిపాల రామనాథమ్మ జడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులైన నాగార్జున, సత్యవతిల సేవలను ఎంఇఓ రహీమ్, హెడ్మాస్టర్ అభినందించారు.

### ముదివర్తిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ

విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామంలో ఏర్పాటుచేసివున్న పోలింగ్ కేంద్రాలను ఈనెల 17న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్‌ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

### బిట్రగుంట బ్రహోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బోగోలు మండలం కొండ బిట్రగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 22 నుంచి మూడురోజుల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. అల్లూరు, శంఖనిపాలెం, చెన్నారాయునిపాలెం, ఇస్కపల్లి, నెల్లూరు నుంచి కూడా బస్సులు ఏర్పాటుచేశామన్నారు.

### ఆత్మకూరు ప్రభుత్వ మద్యం షాపులో చోరీ

ఆత్మకూరులోని మునిసిపల్ బస్టాండ్‌వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో మొన్న ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు వెనుకవైపునున్న గోడకు రంధ్రం వేసి క్యాష్‌బాక్సును ఎత్తుకుపోయారని, దాంట్లో రెండురోజుల కలెక్షన్ రూ. 3.89 లక్షలు ఉందని సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కొండ్లపూడిలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (ఎన్ఎస్‌యు) ఎన్ఎస్ఎస్ విభాగం సూచనలతో నెల్లూరు డీకెడబ్ల్యు డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ఈనెల 18న కొండ్లపూడిలో వారం రోజులపాటు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. డీకెడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపాల్ డా.గిరి, ఎన్ఎస్ఎస్ అధికారులు పి.ఉమామహేశ్వరి, డా.వై.దివ్య, డా. వై. వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

# జగన్ చెంతకు.. మలిరెడ్డి కోటారెడ్డి




ప్రముఖ న్యాయవాది, రంజీ మాజీ క్రికెటర్ మలిరెడ్డి కోటారెడ్డి వైకాపాలో చేరిపోయారు. ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపస్ కార్యాలయంలో కలవగా, మలిరెడ్డిని సీఎం ఆత్మీయంగా పలకరించి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మలిరెడ్డి సోదరులను ముఖ్యమంత్రి అభినందించారు. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మలిరెడ్డి కోటారెడ్డి, ఆయన సోదరుడు.. ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి సీఎం జగన్‌ను కలిశారు.

మలిరెడ్డి సోదరులు ప్రముఖ న్యాయవాదులుగా పేరు తెచ్చుకున్నారు. కోటారెడ్డి విఆర్‌సిలో చదువుకుంటూ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలతో యువనాయకునిగా ఎదిగారు. క్రికెట్ అంటే ఆయనకెంతో అభిమానం. క్రికెట్‌లో ఆయన రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో కూడా బాగా రాణించారు. నెల్లూరుజిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆయనకు అభిమానులున్నారు. ముఖ్యంగా యువతకు ఆయనంటే ఇష్టం. అటు స్థానికంగా ప్రజలతోనూ, నాయకులతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేరిక వైకాపా వర్గాల వారికి, కార్యకర్తలకు సంతోషం కలిగించింది. రానున్న ఎన్నికల్లో మలిరెడ్డి సోదరుల సహకారంతో నూతనోత్తేజంతో ముందడుగు వేయవచ్చని ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## కల్మషం లేని నాయకులు..మలిరెడ్డి సోదరులు - ఆదాల

మలిరెడ్డి సోదరులు కల్మషం లేని నాయకులని ఆదాల అభినందించారు. ఈనెల 20న నెల్లూరు శాంతినగర్‌లోని మలిరెడ్డి సోదరుల కార్యాలయానికి వెళ్ళిన ఆదాల, వారితో రూరల్ నియోజకవర్గంలో తాజా రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భగా ఆదాల మాట్లాడుతూ మలిరెడ్డి సోదరులు సీఎం సమక్షంలో వైకాపాలో చేరడం తమకెంతో శుభపరిణామమన్నారు. మలిరెడ్డి బాటలోనే మరికొంతమంది ప్రముఖులు కూడా వైకాపాలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, ఎన్నికల నాటికి రూరల్‌లో తెలుగుదేశం పార్టీ చాపచుట్టేయడం ఖాయమని అన్నారు. అభివృద్ధి మంత్రమే తనకు శ్రీరామరక్ష అని, డూప్‌షాట్లు చేయడం తమకు చేతకాదని అన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని, ప్రజలు రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తారన్న ఆశాభావాన్ని ఆదాల వ్యక్తం చేశారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com